మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

## ఆరోగ్యమే..మహా భాగ్యం



3లో..

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 16 శుక్రవారం 13 - 06 - 2025 పేజీలు: 8 వెల: 4


# డేంజర్ లో... డ్యాం..

- శ్రీశైలం డ్యాంలో విస్తరిస్తోన్న ఫ్లంజ్ పూల్
- కొనసాగుతోన్న అధ్యయనాలు
- ప్రాజెక్టు భద్రతపై సర్వత్రా వెల్లువెత్తుతోన్న ఆందోళన



(మన గళం,కర్నూలు) : అవును..తాజా అంచనాలను పరికిస్తే డ్యాం డేంజర్ జోన్ లోనే ఉంది. నంద్యాల జిల్లాలోని శ్రీశైలం డ్యాం తాజా పరిస్థితి కాసంత..ఆందోళనకరంగానే అగుపిస్తోంది. ఆ డ్యాంలో విస్తరిస్తోన్న ఫంజ్ పూల్ పై సర్వత్రా చర్చలైతే కొనసాగుతున్నాయి. ఆ డ్యాంలో ఫ్లంజ్ పూల్ అన్నది దిన,దినానికీ విస్తరిస్తోంది. ప్రాజెక్టు భద్రతపై అంతటా కొంత భయాందోళనలైతే వెల్లువెత్తుతున్నాయి. ఆ సమస్యపై తాజాగా కొన్ని అధ్యయనాలైతే జరుగుతున్నాయి.

నీలం సంజీవ రెడ్డి శ్రీశైలం ప్రాజెక్టు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కృష్ణా నదిపై నిర్మించిన భారీ బహుళార్థసాధక ప్రాజెక్టు. కేవలం జలవిద్యుత్తు ప్రాజెక్టుగానే ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు, తరువాతి కాలంలో నీటిపారుదల అవసరాలను కూడా చేర్చడంతో బహుళార్థసాధక ప్రాజెక్టుగా మారింది. తరువాతి కాలంలో ప్రాజెక్టు పేరును నీలం సంజీవరెడ్డి సాగర్ ప్రాజెక్టుగా మార్చారు.ప్రాజెక్టు శంకుస్థాపన



1963 జూలైలో అప్పటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా జరిగింది. 1964లో రూ.39.97 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు అంచనా 1991 నాటికి రూ.567.27 కోట్లయింది. డ్యాము నిర్మాణం క్రెస్టుగేట్లతో సహా 1984 డిసెంబరు నాటికి పూర్తయింది. 1985 వర్షాకాలంలో జలాశయం పూర్తి మట్టానికి నీటితో నిండింది. అయితే...అంత వరకు బాగానే ఉన్నా 2009 అక్టోబరు 2న ప్రాజెక్టు సామర్థ్యానికి మించి వరదనీరు వచ్చిచేరింది. అంతకు మూడు దశాబ్దాల ముందు 13 లక్షల క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టులోని 25 లక్షల క్యూసెక్కుల వరదనీరు ప్రవహించడంతో ప్రాజెక్టు అధికారులు భయాందోళనలకు గురయ్యారు. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని గేట్లను పూర్తిస్థాయిలో ఎత్తినప్పటికీ వరద రాక, పోక కంటే రెట్టింపు స్థాయిలో ఉండటంతో ఒకదశలో ప్రాజెక్టు పైనుంచి నీరు ప్రవహించవచ్చని ప్రాజెక్టు లోతట్టు గ్రామాలు మునిగిపోవచ్చని భావించారు. విద్యుదుత్పత్తిని పూర్తిగా

2లో..



## కుప్పకూలిన విమానం

మన గళం, గుజరాత్: అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. మేఘానిలో ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన వెంటనే కుప్పకూలింది. ప్రమా దం సమయంలో విమానంలో

2 లో..

## రాష్ట్రంలో భారీ వర్షాలు



2లో..

మన గళం, విశాఖపట్నం : పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉందని విశాఖపట్నంలోని వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది. అలాగే ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశాలో ప్రస్తుతం

## ఏపీ రైతులకు కేంద్రం శుభవార్త



మన గళం, అమరావతి : రాష్ట్ర రైతులకు గుడ్ న్యూస్ చెప్పింది. కందిపప్పు సేకరణ గడువును పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు. కందిపప్పు సేకరణను మరో 15 రోజులకు పొడిగింపుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలుపుతూ.. ఈ నిర్ణయంలో త్వరి తగతిన సహకరించి రైతులకు ఎంతో ఉపయోగపడేలా చర్యలు తీసుకున్నందుకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కేంద్రమంత్రి రామ్మోహన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రైతులకు శుభవార్త. కందిపప్పు సేకరణ గడువుపై మన ప్రభుత్వ అభ్యర్ధనను పరిశీలించి ఖరీఫ్ 2024-25 కాలానికి కంది పప్పు సేకరణ గడువును కేంద్రం మరో 15 రోజులు పొడిగించింది. సేకరణ పరిమితి 95,620 మెట్రిక్ టన్నులుగా జూన్ 26 వరకు రైతుల నుంచి కంది పప్పు మద్ద తు

2 లో..

# ప్రజల్లో మార్పు రావాలి

- ట్రాఫిక్ పట్ల అవగాహన పెరగాలి
- గతంలో పోలిస్తే నిబంధనలు కఠినతరమయ్యాయి
- నిబంధనలు ఉల్లంఘిస్తే..వే(చే)టే
- వాహనచోదకులు నిర్లక్ష్యాన్ని వీడాలి
- ట్రాఫిక్ సి.ఐ.మన్సూరుద్దిన్

(మన గళం,కర్నూలు ప్రత్యేక ప్రతినిధి) : చట్టం ఎవ్వరికీ చుట్టం కాదు...చట్టం ముందు అందరూ సమానులే..నన్నారు కర్నూలు ట్రాఫిక్ సి.ఐ. మన్సూరుద్దిన్. గురువారం నగరంలోని స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో ఆయన మన గళం ప్రత్యేక ప్రతినిధితో ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఆ ఇంటర్వ్యూ పూర్తి సారాంశం..మన గళం పాఠకుల కోసం...



**మ.ప్ర :** కర్నూలు నగరంలో ట్రాఫిక్ అన్నది ఓ పద్మవ్యూహంలా తయారైంది. ఇందుకు ప్రధాన కారణాలేమంటారు ?

**సి.ఐ :** నగరంలో దాదాపుగా 4 లక్షలకు పైగా జనాభా ఉంది. అందులో ప్రతి ఇంట్లో ఓ వెహికల్ ఉంటుంది. గతంలో నగరంలో 5 వేల ఆటోలుండగా ఇప్పుడు 25 వేల ఆటోలయ్యాయి. దీంతో పాటు ప్రతి రోజూ దాదాపుగా 75 వేల నుంచి లక్ష బైక్ లు,, 20 వేల కార్లు రోడ్ల పై తిరుగుతున్నాయి. అంతే కాదు..ఎప్పుడో 30-40 సంవత్సరాల కాలం నాటి రహదారులు ఇంకా కొన్ని ప్రాంతాల్లో రహదారుల విస్తరణ జరగాల్సి ఉంది. అసలు రాయలసీమ జిల్లాల్లోనే అతి రద్దీ గా ఉన్న



నగరాల్లో కర్నూలు ప్రధానమైంది. ఈ పలు రకాల కారణాలతోనే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

**మ.ప్ర :** గతంలో పోలిస్తే...తాజాగా ట్రాఫిక్ నిబంధనలన్నవి చాలా కఠినతరమయ్యాయంటున్నారు. ఇది వాస్తవమేనా ?

**సి.ఐ :** అవును. ఇది వాస్తవమే. 2021 లో అమెండ్మెంట్ వచ్చింది. అప్పటి నుంచి మోటార్ వెహికల్ యాక్ట్ అన్నది

2లో..

# సుపరిపాలనలో మొదటి అడుగు

**- పథకం కోసం రూ.10,091 కోట్లు, పాఠశాలల అభివృద్ధికి రూ.1,346 కోట్లు కేటాయింపు**

మన గళం, అమరావతి : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా సుపరిపాలనలో తొలి అడుగు వేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నేటి నుంచి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ 'తల్లికి వందనం' పథకం ఇస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి గురువారంతో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ హామీని నెరవేరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, సూపర్ సిక్స్ హామీల్లో ఇది ఒక కీలకమైన పథకమని పేర్కొన్నారు.

**- 67 లక్షల మంది పిల్లలకు లబ్ధి**




'తల్లికి వందనం' పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 67.27 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని, ఇందుకోసం మొత్తం రూ.10,091 కోట్లు ఖర్చు చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఈ నిధుల్లో రూ.1,346 కోట్లను పాఠశాలల అభివృద్ధికి వినియోగించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోని అమ్మఒడి పథకంతో పోల్చినప్పుడు, తమ ప్రభుత్వం అందిస్తున్న 'తల్లికి వందనం' పథకం ద్వారా ఎక్కువ మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. గత

2 లో..

# కరోనాతో ముగ్గురు మృతి

మన గళం డెస్క్ : భారత్‌లో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి.. పదులు, వందలుగా ఉన్న కేసులు.. ఇప్పుడు వేలకు వేలుగా పెరిగిపోవడం భయాందోళన కలిగిస్తోంది.. గురువారం కూడా కరోనా కేసుల సంఖ్య పెరిగింది. గత 24 గంటల్లో (గురువారం ఉదయం) దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 7,154కి పెరిగిందని ఆరోగ్య - కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. గత 24 గంటల్లో 33 కేసులు నమోదయ్యాయి. 983 మంది కరోనా నుంచి కోలుకున్నారు. గురువారం కొత్తగా 3 కోవిడ్ సంబంధిత మరణాలు నమోదయ్యాయి.. మహారాష్ట్రలో రెండు, మధ్యప్రదేశ్‌లో ఒకరు మరణించారు. 2025 జనవరి నుంచి మొత్తం మరణాల సంఖ్య 77కి చేరుకుంది. ఈ సంవత్సరం ఇప్పటివరకు 8,000 మందికి పైగా ఈ ఇన్ఫెక్షన్ నుంచి కోలుకున్నట్లు ప్రభుత్వం డేటాలో వెల్లడించింది. దాదాపు అన్ని రాష్ట్రాల్లో యాక్టివ్ కేసులలో స్వల్ప పెరుగుదల నమోదైనప్పటికీ.. కేరళలో అత్యధిక సంఖ్యలో కోవిడ్ -19 కేసులు నమోదవుతున్నాయి. గురువారం ఉదయం యాక్టివ్ కేసుల సంఖ్య 2165 గా ఉంది. ఇండియా కోవిడ్ -19



2 లో..

# కుప్పకూలిన విమానం



మొదటిపేజీ తరువాయి

242 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. షాహీబాగ్ హొటల్ సమీపంలో విమానం కూలడంతో పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగలు అలుముకున్నాయి. వెంటనే అలర్ట్ అయిన స్థానికులు అధికారులకు సమాచారం అందించా రు. ఘటన స్థలానికి చేరుకున్న అధికారులు, ఫైర్ సిబ్బంది, ప్రయాణికులను రక్షించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను అంబులెన్సులలో హుటాహుటినా ఆసుపత్రికి తరలిస్తున్నారు. కుప్పకూలిన విమానం ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 ఫ్లైట్ గా గుర్తించారు. ఈ విమానం అహ్మదాబాద్ నుంచి లండన్‌కు వెళ్తున్నట్టు సమాచారం. టేక్ ఆఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే విమానం కుప్పకూలడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా, అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా ప్రమాదంపై కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హుటాహుటిన అహ్మదాబాద్‌కి బయలుదేరారు. ఈ విషయంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా గుజరాత్ సీఎంతో ఫోన్లో మాట్లాడారు. విమాన ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఆరా తీశారు.

# రాష్ట్రంలో భారీ వర్షాలు

మొదటిపేజీ తరువాయి

ఉపరితల ఆవర్తనం విస్తరించిందని తెలిపింది. ఈ ప్రభావం కారణంగా రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే కోస్తా ఆంధ్రాలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడతాయని చెప్పింది. కొన్ని చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందంది. ఈ సమయంలో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నంలోని వాతావరణ శాఖ సూచించింది. మరో వైపు అనుకున్న సమయానికంటే ముందే నైరుతి రుతుపవనాలు తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశించాయి. దీంతో ఇప్పటికే విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇంకోవైపు కొన్ని ప్రాంతాల్లో ఎండలు మండిపోతున్నాయి. అయితే ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉండడంతో.. రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడనున్నాయి.

# సుపరిపాలనలో మొదటి అడుగు

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం కేవలం 42,61,965 మంది విద్యార్థులకే అమ్మఒడి పథకం అందించింది. మా ప్రభుత్వం 67,27,164 మంది విద్యార్థులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తోంది. అంటే, గత ప్రభుత్వం కంటే 24,65,199 మంది విద్యార్థులకు అదనంగా సాయం అందిస్తున్నాం. వారు రూ.5,540 కోట్లు ఇస్తే, మేం రూ.8,745 కోట్లను నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. వారికంటే రూ.3,205 కోట్లు అదనంగా కేటాయిస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

– 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు..!

ఒకటో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులను కూడా ఈ పథకం కింద పరిగణనలోకి తీసుకున్నామని, పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే వారికి కూడా నిధులు జమచేస్తామని హామీ ఇచ్చారు. తల్లి లేని పిల్లలకు తండ్రి లేదా సంరక్షకుల ఖాతాల్లో, అనాథ పిల్లల విషయంలో జిల్లా కలెక్టర్ నిర్దేశించిన వారికి నగదు జమ చేస్తామని తెలిపారు. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే 76 వేల మంది విద్యార్థులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. పారదర్శకత కోసం లబ్ధిదారుల జాబితాను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తామని, సాంకేతిక కారణాలతో ఎవరికైనా సమస్య తలెత్తితే ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, 30న తుది జాబితా ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న వారిలో బలహీన వర్గాలకే పెద్దపీట వేశామని, జనాభా సమతుల్యతలో ఇది ఒక ముందడుగు అని సీఎం అభిప్రాయపడ్డారు. అభివృద్ధి, సంక్షేమం ఎన్డీఏ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని, సంపద సృష్టించి, ఆదాయాన్ని పెంచి, దాన్ని అభివృద్ధికి, సంక్షేమానికి ఖర్చు చేస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్నామని చంద్రబాబు అన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని బాగుచేస్తామని, కష్టాలు వచ్చినప్పుడు వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఇతర సంక్షేమ పథకాల అమలుపైనా ఆయన ప్రస్తావించారు.

# ఏపీ రైతులకు కేంద్రం శుభవార్త

ధరపై సేకరిస్తారు. ఈ నిర్ణయంలో త్వరితగతిన సహకరించి రైతులకు ఎంతో ఉపయోగపడేలాగా చర్యలు తీసుకున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మా ప్రత్యేక ధన్యవాదాలు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, ఎన్డీఏ ప్రభుత్వం మన రైతుల సంక్షేమం కోసం గ్రామీణ ప్రాంతా అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తోంది' అంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ట్వీట్ చేశారు.

మొదటిపేజీ తరువాయి



# డేంజర్ లో...డ్యాం



మొదటిపేజీ తరువాయి

నిలిపివేశారు. ప్రాజెక్టు లోతట్టు ప్రాంతాలలోని జనావాసాలను పూర్తిగా ఖాళీ చేయించారు. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా 2009 అక్టోబరు 2 మధ్యాహ్నం నాటికి 896 అడుగులకు చేరింది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం దాటితే ఏ క్షణమైనా వరద ఉధృతితో ప్రాజెక్టుకు ముప్పు ఏర్పడుతుందని భావించిన ఇంజనీర్లు సైతం ప్రాజెక్టు శక్తిని చూసి నివ్వెరపోయారు.%ళి3ఠి% అక్టోబరు 2 అర్ధరాత్రి నుంచి వరద కొద్దికొద్దిగా తగ్గుముఖం పట్టడంతో ప్రతిగంటకు రెండు అంగుళాల నీటిమట్టం తగ్గడంతో అక్టోబరు 3 సాయంత్రం నాటికి భయాందోళనలు తగ్గాయి. ఇప్పుడు తాజాగా ఆనాటి వరదే డ్యాం కొంప ముంచినట్లయింది. డ్యాంలో నీటి అడుగున ఫ్లంజ్ పూల్ రోజు,రోజుకీ విస్తరిస్తుండడంతో ప్రాజెక్టు కు ఎక్కడ ముప్పు ఏర్పడుతుందోననే ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో తాజాగా...మూడో రోజు శ్రీశైల జలాశయం లో విశాఖకు చెందిన సిలైన్ ఆఫ్షోర్ డైవింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన 14 మంది బృందం సర్వే ప్రారంభించింది. అత్యాధునిక కెమెరాలతో ఫ్లంజ్ పూల్, దెబ్బతిన్న సిలిండర్లు వీడియోగ్రఫీ ద్వారా లోతు, వెడల్పును చిత్రీకరించనున్నారు ముఖ్యంగా ప్లాంజ్ పూల్ లోతు,వెడల్పు ఎంతవరకు పెరిగిందా అని వీడియోగ్రఫీ ద్వారా అధ్యయనం చేయనున్నారు. 1)ఫ్లంజ్ పూల్ మొత్తం :147 అడుగులు, 2)వెడల్పు :270అడుగులు, 3) పొడవు :400 అడుగులు. దాదాపుగా 12 రోజులు సర్వే అనంతరం ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నారు. శ్రీశైలం జలాశయం లో 2009 వరదల తర్వాత ఫ్లంజ్ పూల్ వద్ద ఏర్పడిన పెద్ద గొయ్యి కారణంగా శ్రీశైలం జలాశయం దగ్గర పూర్తిగా ఫ్లంజ్ పూల్,సిలిండర్లు దెబ్బ తిన్నాయి. ఇది మరింతగా పెరిగితే డ్యామ్ పునాదికి ప్రమాదం వాటిల్లుతుందా ? లేదా అత్యవసరంగా ఎటువంటి మరమ్మతులు చేయాలి ? అనే విషయాల్లో పూర్తిగా అధ్యయనం చేయడం ద్వారా ఖచ్చితమైన నివేదికను ప్రభుత్వానికి అందించి త్వరితగతిన మరమ్మతులు చేపట్టడం ద్వారా డ్యామ్ భద్రతను పటిష్టం చేసే దిశగా కూటమి ప్రభుత్వం ప్రణాళిక రచించినట్లుగా తెలుస్తోంది. .వాస్తవానికి జలాశయంలో మునిగిపోయిన గ్రామాల ప్రజల పునరావాసానికి సంబంధించి, శ్రీశైలం ప్రాజెక్టు గతంలో ఎంతో వివాదాస్పదమైంది. కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాలలోని 100 గ్రామాలు, 17 శివారు పల్లెలు జలాశయంలో మునిగిపోయాయి.ఆనాటి ప్రభుత్వాలు ముంపు బాధితులను కనీసం మనుష్యులుగానైనా చూడలేదు. ఈ రోజుకు అమాయక రైతులకు కనీస న్యాయం చేయలేదు. మన ప్రభుత్వాలు, మనం హిరోసిమ నాగసాకి లను మాత్రమే గుర్తు పెటుకుంటాం కానీ మన మధ్య జరిగిన మానవ విధ్వంసం ,అమాయక రైతులకు జరిగిన అన్యాయం మనకు పట్టదు. మళ్లీ తాజాగా డ్యాంలో విస్తరిస్తోన్న ఫ్లంజ్ పూల్ సమస్య పరిష్కారమవుతుందో, లేక..మరెంతటి ఉపద్రవాన్ని మరోసారి తెచ్చిపెడుతుందో వేచి చూడాల్సిందే.

# ప్రజల్లో మార్పు రావాలి



మొదటిపేజీ తరువాయి

కఠినతరమైంది. హెల్మెట్ ధరించకపోతే గతంలో రూ.100 చలానా ఉండేది. ఆ ఆమెండ్మెంట్ తో అది కాస్తా రూ.1000కి చేరింది. రాంగ్ పార్కింగ్ కి రూ.2 వేలు చలానా పడుతుంది. గతంలో అదే రూ.500 ఉండేది. 2003లో 1,67,650మందికి పైగా ప్రమాదాల్లో చనిపోయారు. ప్రతి 5 నిమిషాలకో మనిషి రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారు. అందుకే భారత ప్రభుత్వం,సుప్రీం కోర్టు,హైకోర్టులు ఈ నిబంధనల విషయంలో చాలా సీరియస్ చర్యలు తీసుకోవాలనే నిర్ణయం తీసుకున్నారు.

**మ.ప్ర :** త్రిబుల్ రీడింగ్ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

**సి.ఐ :** త్రిబుల్ రీడింగ్ మొదటి సారి చేస్తే ఆటోమోటిక్ గా చలానా పడిపోతుంది. రూ.1000 జరిమానాగా ఉంటుంది. అదే మూడోసారి అదే తప్పు చేస్తే ఆటోమోటిక్ గా ఆర్.టి.ఏ.కు సమాచారం వెళ్లి, డ్రైవింగ్ లైసెన్స్ క్యాన్సిల్ కావడం జరుగుతుంది.

**మ.ప్ర :**డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే ఎలాంటి పనిష్ మెంట్ ఉండే అవకాశముంది ?

**సి.ఐ :** డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే రూ.5 వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

**మ.ప్ర :** డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే వాహన చోదకులు ఎలాంటి శిక్షలకు గురయ్యే అవకాశముంది ?

**సి.ఐ :** రోడ్డు ప్రమాదాలు నివారించాలనే సదుద్దేశ్యంతోనే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఏ.పి.లో ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో 670 మంది చనిపోయారు. దీంతో ప్రభుత్వం సీరియస్ గా తీసుకోవడంతో గతంలో డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే రూ.3,500లు జరిమానాగా ఉండేది..ఇప్పుడు ఖచ్చితంగా రూ.10,000లకు చేరుకుంది. గతంలో రెండు రోజులు జైలు శిక్ష ఉండగా, ఇప్పుడు 3 నెలల జైలు శిక్ష తప్పదు.



**మ.ప్ర :** మైనర్ డ్రైవింగ్ విషయంలో ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటున్నారు ?

**సి.ఐ :** మైనర్ డ్రైవింగ్ కేసులో పట్టుబడితే సంబంధిత వ్యక్తి తండ్రి గానీ, లేదా సంరక్షకుడికి గానీ జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా తప్పదు.

**మ.ప్ర :** నగరంలో చాలా ప్రాంతాల్లో చూస్తున్నాం..ఫ్యాషన్ బైకుల పేరిట కొందరు కుర్రాళ్లు సైలెన్సర్ల ను మోడిఫై చేసి, పెద్ద పెద్ద శబ్దాలతో నగర వాసులకు కొంత అసౌకర్యాన్ని అయితే కల్పిస్తున్న పరిస్థితి..మరి ఈ దుస్థతిని నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

**సి.ఐ :** మీరు..చెప్పేది ముమ్మాటికీ వాస్తవమే. కొందరి అవగాహనా రాహిత్యం పలువురు నగరవాసులకు అసౌకర్యాన్ని కల్పిస్తుంది. అందుకే మేం ఈ దుస్థితిని నివారించేందుకు అలా సైలెన్సర్లు మాడిఫై చేసి, వాహనాలు నడిపే వారిని ఆపి, వాహనాన్ని సీజ్ చేసి, రూ.1,030ల ఫైన్ వేస్తున్నాం. అంతే కాకుండా సౌండ్ పొల్యూషన్ యాక్ట్ మేరకు 80 డిసిబుల్స్ దాటితే బండిని సీజ్ చేస్తాం. సైలెన్సర్లు తీసి వేసి, బుల్డోజర్ తో తొక్కిస్తాం. ఇలా..270 వరకు సైలెన్సర్లను కొండారెడ్డి బురుజు ఎదుట బుల్డోజర్ తో తొక్కించేశాం. ఇది ఓ నిరంతర ప్రక్రియ.

**మ.ప్ర :** వాహన చోదకుల్లో ట్రాఫిక్ పట్ల మరింత అవగాహన కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

సి.ఐ : వాహనాల తనిఖీ అన్నది ప్రతి రోజు ఉదయం,సాయంత్రం వేళల్లో చేపడుతున్నాం. సాయంత్రం వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేస్తున్నాం. వాహనదారుల్లో అవగాహన కల్పించేందుకు మేం ఆటో డ్రైవర్లు,వాహన చోదకులను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు పిలిపించి, కౌన్సిలింగ్ సెంటర్ లో కౌన్సిలింగ్ ఇస్తాం. ప్రొజెక్టర్ ద్వారా ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పిస్తున్నాం.

మ.ప్ర : ఓ.కే. అండి..ట్రాఫిక్ నిబంధనల గురించి చాలా చక్కటి సమాచారాన్ని అందించారు. చివరగా మారు వాహన చోదకులకు చెప్పేదేంటి ?

**సి.ఐ.** నేను చెప్పేది ఒక్కటే. తాగి వాహనాలను నడపకండి, తాగి నడిపితే నాడీ వ్యవస్థ ప్రభావితమై రోడ్డు ప్రమాదాలు జరిగి, చనిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మీ కుటుంబాలు చిన్నాభిన్నమై పోతాయి. అంతే కాకుండా..సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయకండి. అలా చేస్తే ఫోన్ పై ధ్యాసతో ప్రమాదాలు జరిగే అస్కారమెక్కువగా ఉంటుంది. త్రిబుల్ రైడింగ్ చేయకండి.

# కరోనాతో ముగ్గురు మృతి

మొదటిపేజీ తరువాయి

డాష్‌బోర్డ్ ప్రకారం.. గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు కూడా ఈ సంవత్సరం చాలా ఎక్కువ సంఖ్యలో యాక్టివ్ కేసులను నివేదించాయి. ఇదిలాఉంటే.. ఏపీలో 30 కేసులు పెరిగి.. యాక్టివ్ కేసుల సంఖ్య 103కి చేరుకుంది. తెలంగాణలో 1 కేసు నమోదు కాగా.. యాక్టివ్ కేసుల సంఖ్య 12కి చేరింది. దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆసుపత్రుల సంసిద్ధతను అంచనా వేయడానికి దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్‌లను ప్రారంభించింది.. తగినంత ఆక్సిజన్ సరఫరా, ఐసోలేషన్ పడకలు, వెంటిలేటర్లు, అవసరమైన మందులు ఉండేలా చూసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించింది. చాలా కేసులు తేలికపాటివని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఇంటి సంరక్షణలో ఉంటే సరిపోతుందని.. ఏమైనా జబ్బులు ఉంటే చికిత్స తీసుకోవాలని సూచించింది.

# విమాన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరుగుతుంది

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. 242 మంది ప్రయాణికులతో అహ్మదాబాద్ ఎయిర్ పోర్టు నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయిన కాసేపటికే కూలిపోయింది. ఈ విమానం ఎయిర్ పోర్ట్ సమీపంలోని ఓ బిడ్జింగ్‌ను ఢీకొట్టి కుప్పకూలింది. ఈ ప్రమాదంలో బిడ్జింగ్‌లో ఉన్న పలువురు మెడికల్ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. అయితే విమాన ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య మాత్రం ఇప్పటి వరకు అధికారికంగా వెలువడ లేదు. ఈ ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న వెంటనే హుటాహుటిన ఘటనా స్థలానికి బయల్దేరి వెళ్లారు పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు. అక్కడికి వెళ్లి తాను దగ్గరుండి మరీ సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ విషాదకరమైన, భయంకరమైన సంఘటన తనను పూర్తిగా షాక్ గురిచేసిందని తెలిపారు. ఈ విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కూడా ఉన్నారని తెలిసి చాలా బాధేసిందని అన్నారు. ఈ ప్రమాదంలో ఇతర దేశాల చెందిన వారు కూడా ఉన్నారని ఆయన తెలిపారు. ఈ



సమయంలో, ప్రయాణీకులు వారి కుటుంబాల గురించి మాత్రమే తాను ఆలోచించగలనని.. ఈ ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్టు తెలిపారు.

శుక్రవారం
13 - 06 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# ఆరోగ్యమే..మహా భాగ్యం



మన గళం,కర్నూలు పాతబస్తీ : యోగ కార్యక్రమం మన ఆరోగ్య కోసమేనని దీనిని అందరూ అలవాటు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు ప్రజలను కోరారు. గురువారం ఉదయం కర్నూలు పట్టణములో పర్యాటక ప్రదేశము మరియు చారిత్రాత్మక కట్టడమైన కొండారెడ్డి బురుజు దగ్గర చేపట్టిన యోగ కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ... మే 21 నుండి జూన్ 21 వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ ప్రాంతాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామని అందులో భాగంగా పర్యాటక ప్రదేశమైన కొండారెడ్డి బురుజు వద్ద ఈరోజు యోగ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. యోగ మన ఆరోగ్యం కోసమేనని యోగా చేయడం వల్ల మనం ఆరోగ్యంగా ఉంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. యోగ కార్యక్రమాలలో పాలుపంచుకునే వారి సంఖ్యను రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన దానికంటే ఎక్కువగా చేయగలిగామని తెలిపారు. ఈనెల 17వ తారీఖున అవుట్డోర్ స్టేడియంలో జిల్లాలోని అన్ని మున్సిపల్ కార్మికుల తో మరియు స్థానికులతో కలిసి 5,000 మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నా మని దానిని కూడా ఈ రోజు లాగా విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా సీఈవో సెట్కూర్ వేణుగోపాల్ మాట్లాడుతూ... జిల్లాలో అనేక యోగ కార్యక్రమాలు ఇంతవరకు నిర్వహించుకున్నామని, ఈ నెల 21వ తారీకు న జరుగు యోగ కార్యక్రమంలో పాల్గొనే దానికి కర్నూలు జిల్లా నుండి 10 లక్షల 70 వేల మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగా పర్యాటక ప్రదేశాలైన మంత్రాలయం పుణ్యక్షేత్రం , ఓర్వకల్లు రాక్ గార్డెన్స్ , జగన్నాథ గట్టు , కొండారెడ్డి బురుజు మొదలగు ప్రదేశాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించుకుని యోగాతో పాటు టూరిజమును కూడా అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్సిసి కమాండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్సిసి క్యాడెక్స్ ను యోగాలో భాగస్వాములను చేసి మమ్ములను ఉత్సాహపరిచినందుకు ధన్యవాదాలు తెలుపుతూ భారత్ మాతాకీ జై , ఆంధ్ర ప్రదేశ్ కి జై అనే నినాదాలను సభికులతో పలికించారు. జిల్లా టూరిజం అధికారి యోగా కార్యక్రమాల ఇన్చార్జి విజయ మాట్లాడుతూ జిల్లాల్లో జరిగే ప్రతి యోగా కార్యక్రమంలో ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఇందులో సహకరించిన అందరికీ, పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో యోగ కార్యక్రమాల లో పాలు పంచుకోవడం చాలా ఆనందంగా ఉందని ఈ సందర్భంగా కార్పొరేటర్ కైప పద్మ లతారెడ్డి తెలిపారు. మొట్టమొదట జ్యోతి ప్రజ్వలన గావించి యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సీఈఓ జడ్పీ, సీఈవో సెట్కూర్, టూరిజం అధికారి, మెప్మా పీడీ తదితరులు పాల్గొన్నారు. ఆయుష్ డాక్టర్ ప్రసాద్ యోగ విన్యాసాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. జిల్లా యోగా అసోసియేషన్ చిన్నారులు అడ్వాన్స్ యోగా , ఆర్టిస్టిక్ పెయిర్ యోగా ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి , సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, డిఎస్ఓ రాజా రఘువీర్, డిఎస్పి రాఘవేంద్ర ఆచారి, జిల్లా టూరిజం అధికారి విజయ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగ శివలీల, ఎన్సిసి కమాండెంట్ ప్రసాద్ , రాష్ట్ర యోగ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ అవినాష్, ,జిల్లా ఆయుష్ అధికారులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ప్రసాద్, కార్పొరేటర్ లు కైప పద్మలతా రెడ్డి,నిలోఫర్, ఎన్ సిసి విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు.

# ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం




మన గళం,కర్నూలు లీగల్ : జాతీయ , రాష్ట్ర న్యాయ సేవధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గురువారం కర్నూలు న్యాయ సేవా సదన్ లో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లడుతూ బాల కార్మిక వ్యవస్థ నిషేధ ,నియంత్రణ చట్టం 2016 ప్రకారం బాల బాలికల తో పని చేయించుకోవడం లేదా పనిలోకి అనుమతించడం పూర్తిగా నిషేధించబడిందన్నారు. ఎవరైనా ఈ చట్టాన్ని ఉల్లంఘించి బాలలతో పని చేయించుకుంటే వారికి ఆరు నెలల నుండి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించబడుతుందని తెలిపారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ మాట్లాడుతూ బాల బాలికలతో షాపులందుగాని ఫ్యాక్టరీలందు గానీ పనిచేయించుకోవడం నేరమన్నారు. ఎవరికైనా బాల కార్మికులు కనిపిస్తే 1098 కి గాని లేదా లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 గాని కాల్ చేసి తెలుపవలసిందిగా ప్రజలను కోరారు.జడ్జి బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు . అనంతరం జిల్లా న్యాయ సేవ సదన్ నుండి కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కర్నూల్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరినాథ్ చౌదరి, అసిస్టెంట్ కమీషనర్ అఫ్ లేబర్ ఆఫీసర్ సాంబశివరావు, కర్నూలు చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద , చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదాబేగం, బాల సంరక్షణ ఎన్జీవోస్ మౌనిక, జహంగీర్ చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రికవరీ చేసిన 604 ( విలువ రూ.1 కోటి 30 లక్షలు ) మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత

- కర్నూలు జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్
- జిల్లా పోలీసు కార్యాలయంలో " మొబైల్ రికవరీ మేళా " కార్యక్రమం.
- సెల్ ఫోన్లు పోగోట్టుకున్న బాధితులు ఆ మొబైల్ ఫోన్ వివరాలు నమోదు చేయండి.
- ఉచితంగా సెల్ ఫోన్ రికవరీ చేస్తాం... ఎలాంటి రుసుము లేదా ఫీజు గాని ఉండదు.
- పోలీసు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.
- ఒక్కరోజే 54 మొబైల్ ఫోన్లు రికవరి చేసిన కర్నూలు సబ్ డివిజన్ హెడ్ కానిస్టేబుల్ శేఖర్ బాబుకు ప్రశంసాపత్రం అందజేసిన ...అడిషనల్ ఎస్పీ.




మన గళం,కర్నూలు క్రైం : గురువారం కర్నూలు సైబర్ ల్యాబ్ పోలీసులు రికవరీ చేసిన 604 మొబైల్ ఫోన్లను కర్నూలు జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా గారు బాధితులకు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ని మినీ కాన్ఫరెన్స్ హాల్లో "మొబైల్ రికవరీ మేళా" కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మొబైల్ ఫోన్లు ను బాధిత ప్రజలకు అందజేశారు.ఈ సంధర్భంగా అడిషనల్ ఎస్పీ మీడియాతో మాట్లాడారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు గురువారం కర్నూలు పోలీసులు రెండవ విడతలో 604 ( విలువ రూ. 1 కోటి 30 లక్షలు) మొబైల్ ఫోన్లను రికవరీ చేశారన్నారు. ప్రజలు మొబైల్స్ పొగోట్టుకోకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. పోలీసులు సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతాల ఓటిపిలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవ్వరికి ఇవ్వకూడదని, సైబర్ నేరాల పడకుండా ఉండాలన్నారు. ఢిల్లీ, హైదరాబాద్, బెంగుళూరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి రికవరీ చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్క పోలీసును, ప్రత్యేకంగా సైబర్ ల్యాబ్ పోలీసులను అభినందిస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్ అనేది మన జీవితంలో ఒక భాగంగా ఉందన్నారు. మొబైల్ లో మనకు సంబంధించిన పర్సనల్ వివరాలు, ఫోన్ నెంబర్లు, వ్యాపార లావా దేవిలు, అటాచ్ మెంట్స్, సెంటిమెంట్స్, ఆన్ లైన్ బ్యాంకు ఖాతా వ్యవహారాలు ఇలా చాలా మిస్ అవుతూ ఉంటారన్నారు. ఎవరైనా మొబైల్ పోగోట్టుకుంటే వెంటనే కర్నూలు పోలీసు వెబ్ సైట్ కు http://Kurnoolpolice.in/mobiletheft వెళ్ళి పొగోట్టుకున్న మొబైల్ ఐ.యం.వి.వివరాలు తెలియజేస్తే సెల్ పోన్ రికవరీ చేసేందుకు కర్నూలు పోలీసులు కృషి చేస్తారన్నారు. ఈ పోలీసు సేవ కు ఎలాంటి రుసుము ఉండదు, ఉచితం అని , మొబైల్ పోయిన తర్వాత బాధపడడం కంటే ఆ మొబైల్ ఫోన్ పోగోట్టుకోకుండా జాగ్రత్తలు పాటించడం మంచిదని అడిషనల్ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా తెలిపారు. సెల్ ఫోన్ పొగోట్టుకున్న బాధితులకు మొబైల్స్ రికవరీ చేసి ఇచ్చినందుకు జిల్లా ఎస్పీ కి, అడిషనల్ ఎస్పీ కి, సైబర్ ల్యాబ్ పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

1) ఎర్రి స్వామి - చిప్పగిరి .

2024 డిసెంబర్ లో నా మొబైల్ పోగొట్టుకున్నాను. యూట్యూబ్ లో చూసి కర్నూల్ పోలీసు వెబ్సైట్లో ఆన్లైన్ చేయడం జరిగింది. మొబైల్ దొరకడం చాలా ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

2) రవితేజ - ఆస్పరి.

2024 అక్టోబర్ లో మొబైల్ పోయింది, పాల వ్యాపారం, ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. నెల రోజులు కష్టపడితే వచ్చే రూ. 15 వేలతో మొబైల్ తీసుకున్నాను. నా భార్య గర్భవతిగా ఉండిందని చాలా ఏడ్చిందని ఇప్పుడు మొబైల్ దొరకడం చాలా ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

3) ముఖేష్ - ఆదోని

ఆదోని లోని ఆదిత్య నర్సింగ్ హోమ్ హాస్పిటల్ కి వెళ్ళినప్పుడు నా మొబైల్ పోగొట్టుకున్నాను. మొబైల్ దొరకడం ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

4) లింగరాజు - కర్నూలు టౌన్.

జనవరి 12వ తేదీ న గ్రౌండ్ లో ఉన్నప్పుడు మొబైల్ పోయింది. కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో బీఎడ్ చదువుతున్నాను. మొబైల్లో ఆన్లైన్ క్లాసెస్, ఎగ్జామ్స్ రాసేవాడిని. కర్నూల్ త్రీ టౌన్ లో వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసి , మీ సేవలో అప్లై చేయడం జరిగింది. నా మొబైల్ దొరకడం నాకు చాలా ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీ కి కృతజ్ఞతలు తెలిపారు.

5) జనార్ధన్ - కర్నూలు

మ్యారేజ్ బ్యూరో నడుపుతున్నాను. 20 వేల ఫోన్ నెంబర్లు నా మొబైల్ లో ఉన్నాయి. ఈఎంఐ లో నా కుమారుడు మొబైల్ కొనుగోలు చేసి ఇచ్చాడు. కర్నూల్ పోలీస్ వెబ్సైట్లో వివరాలు నమోదు చేయడంతో ఈ మొబైల్ దొరకడం ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీ గారికి కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు సబ్ డివిజన్ కు చెందిన హెడ్ కానిస్టేబుల్ శేఖర్ బాబు ఒక్కరోజే 54 మొబైల్ ఫోన్లు రికవరి చేసినందుకు అడిషనల్ ఎస్పీ గారు ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, కర్నూలు ఇంచార్జి డిఎస్పి శ్రీనివాసాచారి, సిఐలు అబ్దుల్ గౌస్, నాగరాజరావు, రామయ్యనాయుడు, సైబర్ ల్యాబ్ సిఐ వేణుగోపాల్, సైబర్ ల్యాబ్ టెక్నికల్ టీం పాల్గొన్నారు.

# ఘనంగా తెదేపా నేతల సంబరాలు




మన గళం,కర్నూలు సిటి : 2024 జూన్ 12న రాష్ట్రంలో దుష్ట వై.సి.పి. జగన్రెడ్డి పాలనకు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడి, టిడిపి, జనసేన, బి.జె.పి. కూటమికి పట్టం కట్టి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ని అందలమెక్కించి నేటికి సంవత్సర కాలం పూర్తి అయిన సందర్భంగా కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అధ్వర్యంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. తర్వాత భారీకేకు కట్చేసి ఒకరికొకరు పంచుకొన్నారు. బాణసంచా కాల్చి, ప్రజలకు- స్వీట్స్ పంచారు. కార్యక్రమంలో భాగంగా నాయకులు ఆకెపోగు ప్రభాకర్, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డా,, సంజీవకుమార్, డా., కె.వి.సుబ్బారెడ్డి, నాగరాజుయాదవ్, కె.యి, జగదీష్, యం. మల్లికార్జునరెడ్డి, యస్.అబ్బాస్, పుల్లయ్యచౌదరి, హరినాధ్చౌదరి, పద్మలతారెడ్డి, మారుతీశర్మ, గున్నా మార్క్, విజయలక్ష్మి, మొదలగు వారు సంవత్సరం పాలనపై తమ సందేశాలను తెలియజేస్తూ.. శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ఎన్నికలకు ముందు బాబుష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ సందర్భంగా కొన్ని హామీలను ఇవ్వడం జరిగిందనీ, వాటిలో ఇప్పటికే కొని ఆచరణలోకి అమలు చేశారనీ, ఇందులో ప్రధానంగా సామాజిక పెన్షన్లను 4 వేల రూపాయలకు పెంచారు. డి.యస్.సి. ద్వారా టీచర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వడమేకాక పరీక్షలు కూడా నిర్వహించడం, అన్న క్యాంటీన్లను పున: ప్రారంభించడం, ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, మహిళలకు దీపం-2 కింద 3 సిలిండర్లు ఉచితంగా అందజేయడం, ఉచిత ఇసుక విధానం అమలు ఈ రోజు తల్లికి వందనం కింద చదువుకునే ప్రతి విధ్యార్థి తల్లి బ్యాంక్ కాతాలో రూ.15 వేలు జమచేయడం జరిగిందనీ, వంటి పథకాలు అమలు చేశారనీ, త్వరలో రైతులకు అన్నదాత క్రింద ఆర్థిక తోడ్పాటు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యము వంటి వాటిని కూడా అమలు చేయనున్నారనీ వారు వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్మోహన్రెడ్డి కొనసాగించినటువంటి అవినీతి, అరాచకాలతో రాష్ట్రం 10 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారు. వారి పాలనతో విసిగి వేసారిపోయిన రాష్ట్ర ప్రజలు జగన్ ను ఘోరాతి ఘోరంగా ఓడించి, కనీసం ప్రతిపక్ష స్థానం కూడా లేకుండా చేసినా ఇంకా వారికి జ్ఞానోదయం కలుగలేదనీ, ఒక పార్టీ నాయకుడై ఉండి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వచ్చి వాటి పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాడి ప్రజల మద్దత్తు పొందకుండా, ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నారనీ, అక్రమ సంపాదనతో నెలకొల్పినటువంటి సాక్షీ చానల్, సాక్షి పత్రికలో కూటమి ప్రభుత్వంపై ఇష్టానుసారం అసత్య, విష ప్రచారం చేయడం చివరికి నారీమణులను కించపర్చడం, అమరావతి మహిళలను వేశ్యలంటూ దుర్మార్గమైన వ్యాఖ్యలు చేయించి, శునకానందం పొందుతున్న జగనకు అసలు మహిళల పట్ల ఏమాత్రం గౌరవం లేదనేది దీనిని బట్టి తేటతెల్లమైందనీ పేర్కొన్నారు. నిన్న కొంతమంది మహిళలపై రాళ్లదాడి చేయించి జగన్ మరో పెద్ద తప్పు చేశారనీ, గతంలో తల్లినీ, చెల్లిని గెంటివేసిన వాడికి ఇతర మహిళలపై గౌరవముంటుదనుకోవడం తప్పే ఇలాంటి వాడిని ప్రజల మద్యకు రాకుండా చూడాలని తెలిపారు. శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ఈ సంవత్సర కాలంలో చేసిన అబివృద్ధి సంక్షేకార్యక్రమాలకు సంభందించిన వివరములు ఇందు వెంట పొందుపర్చడమైనది. కార్యక్రమునకు పార్టీ నాయకులు పి.జి.గోపీనాథ్, దాశెట్టి శ్రీను, నందిమధు, పేరపోగు రాజ్, రాజశేఖర్, లక్ష్మీదేవి, రామాంజనేయులు, సుంకన్న, కె. చంద్రకాంత్, యస్.కె.బషీర్, పుల్లారెడ్డి బాలవెంకటేశ్వరరెడ్డి, బాబురాజ్, బజారన్న, ప్రవీణ్, పాలారాజ్, శ్రీనివాస్భట్, శేషగిరిశెట్టి, సముద్రాల శ్రీధర్, పాలారాజ్, సత్రం రామక్రిష్ణుడు, పి. హనుమంతరావు చౌదరి, మొదలగు వారితోపాటు అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.

# జూన్ 21 వ తేదీన జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- జూన్ 14 వ తేదీన రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరితో యోగా రిహార్సల్ కార్యక్రమం నిర్వహించాలి
- జూన్ 17వ తేదీ న 5 వేల మంది పారిశుధ్య కార్మికులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించాలి
- కలెక్టర్ పి.రంజిత్ బాషా

మన గళం,కర్నూలు కలెక్టరేట్ : జూన్ 21 వ తేదీన జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం యోగాంధ్ర నిర్వహణపై ఆర్డీవోలు, జిల్లా అధికారులు, మండల స్పెషల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓ లు, తహసీల్దార్ లతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర నిర్వహణ లో భాగంగా రిజిస్ట్రేషన్ చేయడంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించామన్నారు.. రిజిస్ట్రేషన్ చేసిన పౌరులను ట్రైనర్ లకు మ్యాపింగ్ చేయడంలో 91 శాతం పురోగతి సాధించామన్నారు.. ఆలూరు, ఆదోని మున్సిపాలిటీ, సి.బెళగల్ మ్యాపింగ్ చేయడంలో వెనుకబడి ఉన్నారని, యోగాంధ్ర కార్యక్రమానికి ముఖ్యమంత్రి ప్రాధాన్యత ఇస్తున్నారని, నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ ఆలూరు, సి.బెళగల్ ఎంపిడిఓ లను, ఆదోని మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు..సంబంధిత మండల స్పెషల్ ఆఫీసర్లు ఈ అంశంపై సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు..పౌరులకు శిక్షణ కార్యక్రమాలు ఇచ్చిన వివరాలను ఆన్లైన్ లో అప్లోడ్ చేయడంలో కూడా ఆలూరు ఎంపిడిఓ, ఆదోని మున్సిపల్ కమిషనర్ వెనుకబడి ఉన్నారని, వీరికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వేదికల గుర్తింపు, ట్రైనింగ్, ర్యాలీలు నిర్వహించడం తదితర అంశాలపై ప్రతి రోజు సమీక్షించుకోవాలని కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు. జూన్ 21 వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 10 లక్షల 65 వేల మంది పాల్గొననున్నారన్నారు..ఇందులో భాగంగా జూన్ 14 వ తేదీన రిహార్సల్ గా మాస్ డెమాన్స్ట్రేషన్స్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరూ పాల్గొనేలా చూడాలన్నారు. వేదికల్లో గ్రీన్ మ్యాట్,తాగునీరు,.మెడికల్ కిట్స్ వంటి అన్ని సౌకర్యాలను ఏర్పాటుచే యాలని కలెక్టర్ ఆదేశించారు.. యోగా కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియో లను వెబ్సైట్ లో అప్లోడ్ చేయాలన్నారు. థిమాటిక్ యోగా కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జూన్ 17వ తేదిన 5 వేల మంది పారిశుధ్య కార్మికులతో నిర్వహించే యోగా కార్యక్రమాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.. కర్నూలు నగరంలోని ఔట్ డోర్ స్టేడియం లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు కలెక్టర్ కు వివరించారు. టెలి కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, జడ్పీ సీఈవో నాసర రెడ్డి, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు..

## జూలై 9 న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని, లేబర్ కోడ్ లను వ్యతిరే కించండి

మన గళం,కర్నూలు సిటి : గురువారం సిఐటియు న్యూ సిటీ కమిటీ కార్యదర్శి సిహెచ్ సాయి బాబా అధ్యక్షతన జరిగిన ఆయిల్ అండ్ రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ జనరల్ బా డీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సి.ఐ.టి.యు. జి ల్లా అధ్యక్షులు పి.ఎస్. రాధాకృష్ణ ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులు యదేచ్ఛగా కార్మిక శ్రమను దోచుకోవడానికి దాదాపు 140 సంవత్సరాలు క్రితం పోరాడి రక్తం చిందించి ప్రాణ త్యాగాలతో సాధిం చుకున్న కార్మిక చట్టాలను హక్కు లను కాలరాయాలని మోడి గారు కార్మిక చట్టాలను రద్దుచేసి నాలు గు కోడ్లను బిల్లును పార్లమెంట్లో ఆ మోదింప చేసుకొని వాటి అమలు కోసం తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు కేంద్ర ప్రభుత్వం గా ఒక సర్క్యూలర్ విడుదల చేసి ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేయించడానికి కృషి చే స్తున్నది. తగుదునా అమ్మాయని 8 గంటల పని దినాలను 10 గంట లకు పెంచుతూ,రాత్రిపూట మహి ళలు డ్యూటీలు చేయడానికి రా ష్ట్ర మంత్రి మండలి ఆమోదం తీ సుకున్నది. ఇటువంటి విధానాల ను యావత్ కార్మిక వర్గం ఐక్యంగా నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసేం తవరకు పోరాడడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునివ్వడం జరి గింది. దీంతోపాటు కార్మిక వర్గంలో కులతత్వాన్ని మతతత్వాన్ని రె చ్చగొట్టి కార్మిక వర్గ ఐక్యను విచ్ఛి న్నం చేయాలని నరేంద్ర మోడీ గా రు ప్రయత్నాలు ముమ్మరం చేస్తు న్నారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానం వ్యతిరేకంగా కార్మిక వర్గం కలిసి వచ్చే ఇతర ప్రజా సంఘాల తో కలిసి ఐక్యమత్యంగా పోరాటా లకు ఎల్లవేళలా సిద్ధంగా ఉండాల ని అందులో భాగంగా జూలై 9న జరుగు దేశ వ్యాప్త సమ్మెను జయ ప్రదం చేయవలసిందిగా పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో యూని యన్ నాయకులు శాలన్న,శేఖర్, హనుమంతు, మద్దిలేటి, చిన్న మాదన్న, మధు శేఖర్, వెంకటే శ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## తల్లికి వందనంలో కోత విధించటం సిగ్గు చేటు

మన గళం,కర్నూలు సిటి : ఎన్నికల సమయంలో చదువుతున్న ప్రతి విద్యార్థికి 15వేల రూపాయలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుతం నేడు పాఠశాల అభివృద్ధి పేరుతో 2 వేల రూపాలు కోతపెట్టడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప ఒక ప్రకటనలో మండిపడ్డారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఈ ప్రభుత్వం ఇచ్చే 15 వేలు విద్యార్థుల విద్యకు కొంతో గొప్ప ఉపయోగపడతాయని అదేవిధంగా ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజులు కట్టడానికి దోహదపడతాయని భావించారు. కాని ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి తల్లి అకౌంట్లో డబ్బులు పడతాయని చెప్పి ఆ సంతోషం అరక్షణం కూడ ఉండనివ్వకుండా కుటుంబ ఆదాయం గ్రామాల్లో నెలకు రూ. 10వేలు, పట్టణాల్లో రూ.12వేల లోపు ఉండాలని, రైస్ కార్డు ఉండాలని, ఫ్యామిలీకి 3 ఎకరాల్లోపు మాగాణి, లేదా 10 ఎకరాల్లోపు పొడి భూమి, లేదా రెండూ కలిపి 10 ఎకరాల్లోపు ఉండాలని ,ట్యాక్సీ, ట్రాక్టర్, ఆటో సహా ఎలాంటి ఫోర్ వీలర్స్ ఉండకూడదని, కరెంట్ బిల్ నెలకు 300 యూనిట్లు దాటకూడదంటూ విద్యార్థుల హాజరు కచ్చితంగా 75 శాతం హాజరు ఉండాలంటు షరతులు పెడుతూ పాఠశాల అభివృద్ధికి 2వేల రూపాయలు కోత విధించటం చిగ్గుచేటు అన్నారు. కొంతమందికైతే సాంకేతిక సమస్యలంటూ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం చదుకునే ప్రతిఒక్క విద్యార్థికి ఎలాంటి షరతులు లేకుండా తల్లికి వందనం పథకాన్ని వర్తింపచేసి 15వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులను కలుపుకొని నిరసనలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ పాల్గొన్నారు.

## హెచ్.ఓ.డి.లతో సమీక్ష



మన గళం,కర్నూలు వైద్యం : నగరంలోని స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గురువారం హెచ్.ఓ.డి.లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరి హాల్ లో వివిధ విభాగాల అధిపతులతో ఐవిఆర్ఎస్, ఎన్టీఆర్ వైద్య సేవ మరియు ఈ హాస్పటల్, పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.ఎన్టీఆర్ వైద్య సేవ : ఆసుపత్రిలోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద మే నెలలో 3,353 రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నామని అన్నారు. ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ కింద సేవలు అందించినందుకు అన్ని విభాగపు వైద్యులకు అభినందించినట్లు తెలిపారు. ఈ హాస్పిటల్ : ఈ హాస్పిటల్ లో ఇంప్లిమెంటేషన్ చేయడానికి పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించడం జరిగిందని అన్నారు. అనంతరం రెగులర్ గా ప్రతి విభాగపు ఒపి మరియు ఐ పి, డిశ్చార్జ్ అన్ని డేటాను ఈ హాస్పిటల్ లో అప్లోడ్ చేయడానికి హౌస్ సర్జన్స్ మరియు పీజీలు మరియు నర్సింగ్ సిబ్బంది సేవలను వినియోగించుకొనేలా చూసుకోవాలని ప్రతిరోజు ఈ హాస్పిటల్ ఇంప్లిమెంటేషన్ మరియు మానిటరింగ్ చేయాలని వారికి ఆదేశించినట్లు తెలిపారు. పలు విషయాలపై సమీక్ష: ప్రభుత్వ వైద్యసేవలు ప్రజలకు చేరువ కావాలని, ప్రభుత్వం ఇటీవల ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్‌లోని ఆరు అంశాలపై కాల్స్, వాట్సాప్, క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటుందని వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని హెచ్వోడిలకు ఆదేశించారు. ఆసుపత్రిలో సెక్యూరిటీ సేవలను మరింత పటిష్టంగా అమలు చేస్తామని అన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశించినట్లు తెలిపారు. ఒపి విభాగాలలో సమయపాలన పాటించాలని లేని యెడల వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు ఓపి మరియు ఐపి విభాగాలకు సర్ప్రైజ్ విజిట్ చేస్తానని అన్నారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి, రోగులకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డా.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్, సింధు సుబ్రహ్మణ్యం, హెచ్వోడీస్, డా.శ్రీనివాసులు, డా.హరి చరణ్, డా విజయ ఆనంద్, రాధారాణి, డా. శ్రీలక్ష్మి, డా.మాధవి శ్యామల హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్, డా.కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అపరిచితుల మాటలు నమ్మొద్దు



– నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి విశ్వేశ్వర్ రెడ్డి

మన గళం,కర్నూలు నగరపాలక సంస్థ : నగరంలో అపరిచిత వ్యక్తులు వాణిజ్య షాపుల వద్దకు వచ్చి, ఏవేవో పత్రాలు తీసుకోవాలంటూ నగదు అడిగి ఇచ్చే ఎటువంటి పత్రాలను వ్యాపారస్తులు తీసుకోరాదని నగరపాలక ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. గత కొన్ని రోజులుగా నగరంలో కొంతమంది అపరిచిత వ్యక్తులు వ్యాపార షాపులకు ఫలానా పత్రం తప్పనిసరి అని, నగదు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సందేహాలు ఉంటే సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల్లో సంప్రదించాలని, తొందరపడి ఎవరికీ నగదు ఇచ్చి మోసపోవద్దని ప్రజా ఆరోగ్య అధికారి కోరారు.

## షర్మిలా రెడ్డి పర్యటనను విజయవంతం చేసిన కాంగ్రెస్ శ్రేణులకు ధన్యవాదాలు

– ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి అంబటి రామకృష్ణ యాదవ్



మన గళం,కర్నూలు పాతబస్తీ : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైన కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశమునకు హాజరై కర్నూలు పర్యటనను విజయవంతం గావించిన జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి,సీనియర్ నాయకులకు, నియోజకవర్గాల కోఆర్డినేటర్లకు, అనుబంధ సంస్థల అధ్యక్షులకు, మండల కాంగ్రెస్ అధ్యక్షులకు, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు అభిమానులకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ అంబటి రామకృష్ణ యాదవ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ఈనెల 16వ తేదీ పదివేల మందితో యోగ నిర్వహణ

– సోమవారం ఉదయం 10:30 గంటలకు పిజిఆర్ఎస్ – జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా వరకు అందరూ భాగస్వాములై యోగా అభ్యాసాలు

మన గళం,నంద్యాల కలెక్టరేట్ : యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 16వ తేదీ నంద్యాల పట్టణం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పదివేల మందితో యోగ కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆర్డీఓ, డిఎంహెచ్ఓ, డిఎస్డిఓ, సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ సోమవారం నాడు పెద్ద ఎత్తున జరిగే యోగా కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ సూచించారు. గ్రామ సచివాలయ సిబ్బంది నుండి మొదలుకొని జిల్లా స్థాయి అధికారుల వరకు అందరూ భాగస్వాములై యోగా అభ్యాసాలు అవలంబించాలన్నారు. యోగ నిర్వహణ నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 10:30 గం.లకు ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ మార్పును గమనించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ పేర్కొన్నారు.



## కూటమి ప్రభుత్వం మోసం చేసింది



మన గళం,కర్నూలు సిటి : విద్యార్థులు,యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం కర్నూలు జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు గురువారం నగరంలోని స్థానిక ఎస్.వి.కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫిజు రియింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా, ఇంగ్లీష్ మీడియం అమలు చేయకుండా నిరుద్యోగ భృతి అందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన విమర్శించారు. తల్లికి వందనం అందిస్తామని ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. విద్యార్థి, యువజన సమస్యలపై ఈ నెల కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టబోతున్నామని వారు తెలిపారు.

## ఘనంగా సిపిఐ మహా సభలు

మన గళం,కర్నూలు సిటి : కర్నూలు నగరంలో భారత కమ్యూనిస్టు పార్టీ శాఖ మహాసభలు సమావేశాలు జరిగాయి అందులో భాగంగా ప్రకాష్ నగర్ ధర్మపేట కార్ల మాస్ నగర్ ,జనార్ధ రావు నగర్,చదువుల రామయ్య నగర్ బద్రీనాథ్ నగర్ నుండి నూతన కార్యదర్శులు ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ నగర కార్యవర్గ సభ్యులు నల్లన గారు అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులుకె. జగన్నాథం భారత కమ్యూనిస్టు పార్టీ కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి మునెప్పలు ఈ సందర్భంగా .మాట్లాడుతూ దేశంలో ఉన్నటువంటిప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలో ప్రజలు ధనవంతులయ్యారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, ఆదానీ,అంబానీలు ధనవంతులైనంత మాత్రాన దేశం అభివృద్ధి చెందినట్లు కాదని, ప్రధాని నరేంద్ర మోడీ అనుసరించే విధానాల వల్ల పేదలు ఎప్పటికీ ధనవంతులు కాలేరని, మనిషికి 5 కిలోల బియ్యం ఇచ్చి వీటితో సరిపెట్టుకోండి అని చెబుతున్నటువంటి నరేంద్ర మోడీకి వారి కష్టాలు తెలియట్లేదని ఆయన దుయ్యబట్టారు.అదేవిధంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం నల్లధనం తీసుకొని వచ్చి దేశంలో ఉన్నటువంటి ప్రజల అకౌంట్లో 15 లక్షలు వేస్తామని చెప్పి ఇప్పటివరకు కూడా ఎవరి అకౌంట్లో సిల్లీ గవ్వ వేయలేదన్నారు. సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్కరికి కూడా ఉద్యోగాలు ఇవ్వలేదని, దేశం లో ఉన్నటువంటి ప్రభుత్వ సంస్థలని ప్రైవేట్ సంస్థలుగా మార్చి,అమ్ముతున్నాడని,ప్రజా ఉద్యమాలు చేస్తే వారి మీద కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ లో ఉన్నటువంటి నాయకులు కూడా చంద్రబాబు నాయుడు కానీ జగన్మోహన్ రెడ్డి, పవన్ కళ్యాణ్ మోడీకి వభజన చేస్తున్నారని, కానీ ప్రశ్నించే తత్వాన్ని కోల్పోయారని అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్ పరం చేస్తే చూస్తూ మోడీ జిందాబాద్ అంటున్నారు తప్ప చేసింది ఏమీ లేదని కనీసం ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినాక చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ ల పేరు తోటి హామీలు ఇచ్చారు కానీ హామీలు,హామీలుగానే మిగిలాయని, ఇది చాలా దుర్మార్గమైనటువంటి ప్రభుత్వమని కూటమి ప్రభుత్వం కోతల ప్రభుత్వం మాత్రమేఅని, ప్రజల ప్రభుత్వం కాదని కూతలు, కోతలు తప్ప ఇంకేమీ లేవని ఆయన దుయ్యబట్టారు.అదే విధంగా పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు స్థలం గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు స్థలం ఇస్తామన్నటువంటి చంద్రబాబు నాయుడు ఇప్పటివరకు వాటిని ఏమాత్రం ఇవ్వలేదన్నారు. గ్యాస్ సిలిండర్లు, నిత్యవసర వస్తువుల ధరలు అన్ని పెంచుతున్నారు తప్ప ఏ మాత్రం తగ్గడం లేదని ఇది చాలా సిగ్గుచేటు అయినటువంటి విషయమని ఆయన అన్నారు. అదేవిధంగా



కర్నూలు నగరంలో పెరిగిన నగర జనాభా కు అనుగుణంగా మరి ఒక సమ్మర్ స్టోరీస్ ట్యాంక్ నిర్మించాలని కర్నూలు లో పేద మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం వారు ఇచ్చిన టీట్కో గృహాలలో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు వెంటనే అప్పజెప్పాలని అలాగే తిట్టుకోగ్రహాలకు ప్రతిరోజు అక్కడికి బస్సు కూడా ఆర్టీసీ వారు ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం చదువుల రామాయ నగర్ శాఖ సెక్రెటరీగా నల్లన జనార్దన్ రావు నగర్ శాఖ సెక్రెటరీగా రంగన్న కారల్ మార్స్ నగర్ శాఖ సెక్రెటరీగా నాగరత్నమ్మ ధర్మపేట శాఖ సెక్రెటరీగా ధరన్న ,ప్రకాష్ నగర్ శాఖ సెక్రెటరీగా ఖాదర్బాషా అసిస్టెంట్ సెక్రటరీగా ఆశ బద్రీనాథ్ శాఖ సెక్రెటరీగా ,కుమార్ రాజా ఏకీభ్రంగా ఎన్నికైన వారికి దంభోళం శ్రీనివాస రావు అభినందనలు తెలిపారు

## జనసేన పార్టీ అభివృద్ధికి బలోపేతానికి మనమంతా కలిసికట్టుగా కృషి చేద్దాం

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కర్నూలు పట్టణంలోని సంధ్య విక్రమ్ కుమార్ కార్యాలయంలో సంధ్య విక్రమ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కోడుమూరు నియోజవర్గంలోని వివిధ గ్రామాల్లోని ప్రజలు ఈ సందర్భంగా సంధ్యా విక్రమ్ కుమార్ మాట్లాడుతూ అన్ని సమయాల్లో మీరు నాపై చూపిన ప్రేమకు చూపుతున్న ప్రేమకు నా పాదాభివందనం అని మనమంతా కలిసికట్టుగా కోడుమూరు నియోజవర్గంలో జనసేన పార్టీ అభివృద్ధికి బలోపేతానికి కర్నూలు జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్ గారి నేతృత్వంలో పవన్ కళ్యాణ్ గారి ఆశయ సాధన కోసం శ్రామికుల కష్టపడతామని పిలుపునిచ్చారు



# సంపాదకీయం

బాల్యాన్ని ఇటుక బట్టీల్లో కాల్చవద్దు !

అంతర్జాతీయ కార్మిక సంస్థ నిర్వచనం ప్రకారం, బాలల్ని ఉపాధులు లేదా ఉద్యోగాల ఉచ్చులో బంధించి వారి బాల్యాన్ని, శక్తియుక్తులను, గౌరవాన్ని, సంపూర్ణ ఎదుగుదలను, శారీరక మానసిక ఆరోగ్యాన్ని హరింపజేసే లేదా నలిపి వేసే ప్రయత్నాలను బాల కార్మిక వ్యవస్థ అని అంటాం. అంతర్జాతీయ, జాతీయ చట్టాలు, నియమనిబంధనలకు వ్యతిరేకంగా పిల్లలను (5 నుంచి 17 ఏండ్ల లోపు) కార్మికులుగా మార్చి వారి బంగారు భవితను బుగ్గిపాలు చేయడాన్ని బాల కార్మిక దురాచారం అని అర్థం చేసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా నేటికీ 160 మిలియన్ల బాల కార్మికుల బతుకులు ఉపాధుల పేరుతో బుగ్గిపాలు అవుతున్నాయి. వీరిలో వయస్సు 5 - 11 ఏండ్ల లోపు ఉన్న బాలలు 48 శాతం, 12 - 14 ఏండ్ల వారు 28 శాతం, 15 - 17 ఏండ్ల లోపు పిల్లలు 24 శాతం ఉండడం గమనించారు. ఆఫ్రికాలో 20 శాతం బాలలు, ఏసియా పసిపిక్‌లో 7 శాతం, అమెరికన్లు 11 శాతం, యూరోప్-సెంట్రల్ ఆసియాలో 4 శాతం, అరబ్ ప్రాంతాల్లో 3 శాతం బాల కార్మికులు నమోదు అవుతున్నారు. ప్రపంచ బాల కార్మికుల్లో దాదాపు 56 శాతం మధ్య ఆదాయ దేశాల్లోనే ఉండడం ఆశ్చర్యంగా ఉన్నది. బాల కార్మిక వ్యవస్థను రూపు మాపడంలో భారత్ కొంత ప్రగతిని సాధించినప్పటికీ మరింత దృష్టిని కేంద్రీకరించవలసిన అవసరం ఏర్పడుతున్నది. 2011 వివరాల ప్రకారం, 5 - 14 ఏండ్ల లోపు బాల కార్మికులు 43.53 లక్షల ఉన్నారని, 2001లో వీరి సంఖ్య 1.26 కోట్లు ఉండేదని గమనించాలి. పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక-ఆర్థిక సమస్యలతో బాల కార్మిక వ్యవస్థ ప్రధానంగా ముడిపడి ఉంటుంది. భారత బాల కార్మికులు అధికంగా వ్యవసాయం, నిర్మాణ రంగం, ఇటుక బట్టీలు, బాణాసంచా తయారీ కేంద్రాలు, కాల్పెట్ పరిశ్రమ, మైనింగ్, రెస్టారెంట్లు లాంటి రంగాల్లో మగ్గుతున్నారు. భారత రాజ్యాంగం ప్రకారం 14 ఏండ్ల లోపు పిల్లలను చట్టవ్యతిరేకంగా పనిలో పెట్టుకోవడం లేదా ప్రమాదకర పరిస్థితుల్లో బతుకులను గడపడం చట్టవ్యతిరేకమని తెలుపుతున్నది. బాల కార్మిక దురాచారాన్ని రూపుమాపడానికి 1986 బాల కార్మిక చట్టం, 2017 బాల కార్మిక చట్ట సవరణ, 1987లో బాల కార్మికుల జాతీయ పాలసీ లాంటివని తేవడం, అమలు పరచడం జరుగుతున్నది.

ఐరాస-అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ)-యూనిసెఫ్‌ల చొరవతో ప్రతి ఏట 12 జూన్‌న "ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం ( వరల్డ్ డే అగెనిస్ట్ చైల్డ్ లేబర్)"ను పాటించడం ఆనవాయితీగా మారింది. ఈ వేదికగా బాల కార్మిక దురాచారాన్ని కట్టడి చేయడం, అవగాహన కల్పించడం, కఠినంగా చట్టాలు అమలు చేయడం, బాలలకు/కుటుంబాలకు సరైన సహాయాలు అందించడం లాంటివి జరుగుతున్నాయి. 2025 ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం ఇతివృత్తంగా "ప్రగతి స్పష్టమే కాని ఇంకా చేయాల్సింది ఉంది : బాలకార్మిక దురాచార నిర్మూలన వేగం పెంచుదాం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. బాలలు చదువుకోవడం, ఆడు కోవడం, సురక్షిత బాల్యం కొనసాగడానికి మాత్రమే అవకాశం కల్పించాలని కుటుంబ పెద్దలు తెలుసుకోవాలి. పిల్లల శ్రమను దోపిడీ చేయడం, చిన్నారి చేతులకు/దేహానికి/మనస్సుకు గాయాలు చేయడం, బాలల బంగారు భవిష్యత్తును ఆదిలోనే తుంచేయడం అమానవీయం, ఆక్షేపణీయం అని నినదించాలి. బాల కార్మిక దురాచార నిర్మూలనకు సవాళ్లుగా పేదరికం, నిరక్షరాస్యత, తల్లితండ్రుల నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులు, విద్యకు దూరంగా ఉండడం, సామాజిక కట్టుబాట్లు, చట్టాల అమలులో నిర్లక్ష్యం, సామాజిక అంగీకారం, ప్రలోభ యాజమాన్యాలు, అవగాహన లోపం, పౌర సమాజ నిశ్శబ్దం లాంటివి అడ్డుగా నిలుస్తున్నాయి. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి తీసుకోవలసా చర్యల్లో పేదరిక నిర్మూలన, తల్లితండ్రులకు ఉద్యోగ ఉపాధుల కల్పన, పాఠశాలల అందుబాటు, అక్షరాస్యత/అవగాహన పెంచడం, సామాజిక భద్రత కల్పించడం, ప్రభుత్వాలు/పౌర సమాజం/అంతర్జాతీయ సంస్థల సమైక్య కృషి, విద్యపై పెట్టుబడులు పెంచడం, నైపుణ్యాల వృద్ధి, వయోజనులకు ఉద్యోగ కల్పన లాంటివి నిత్యం కొనసాగాలి. బాలల ఆరోగ్య సంరక్షణ, పిల్లల గౌరవాన్ని కాపాడడం, విద్య అవకాశాలు కల్పన, ఆటపాటల కొనసాగింపుకు గట్టి కృషి జరగాలి. ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తున్న బాలల మనసులకు పడుతున్న తూట్లు, విరుగుతున్న ఎముకలు, శ్వాస ఇబ్బందులు, శారీరక గాయాలు, విష రసాయనాల దుష్ప్రభావాలు, ఆందోళనలు, మానసిక ఒత్తిడి, భావోద్వేగ సమస్యలు, సామాజిక-శారీరక-మానసిక ఎదుగుదల సమస్యలు, చిన్నారుల శ్రమ దోపిడీ లాంటివి బాల్యాన్ని చిదిమేయడం నేటి డిజిటల్ యుగంలో సహితం జరగడం సోచనీయం. ఇప్పటికైనా బాల కార్మిక దురాచారాన్ని ప్రపంచం నుంచి పాతాళానికి తరిమేద్దాం, బాలలకు పూర్తి స్వేచ్ఛనిద్దాం.

# యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

మన గళం,నంద్యాల కలెక్టరేట్ : ఈ నెల 13వ తేదీన బెలుం గుహల్లో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిబ్బంది అందరూ సమష్టి కృషి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబధిత అధికారులను ఆదేశించారు. గురువారం యోగాంధ్ర కార్యక్రమంపై జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓలు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు, జిల్లా అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 13వ తేదీ శుక్రవారం బెలుంగుహల్లో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై యోగాసనాలలో పాల్గొని విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని నంద్యాల ఆర్డీఓ, జిల్లా పర్యాటక శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 5 వేల స్థలాలలో యోగ కార్యక్రమాలు నిర్వహించేలా ప్రదేశాలు నమోదు చేయడం జరిగిందన్నారు. సంబంధిత ప్రదేశాల్లో ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏ విధంగా అయితే యోగ నిర్వహిస్తామో అదే విధంగా ఈ నెల 14వ తేదీన ఉ.7గం.ల నుండి ఉ.8.గం.ల వరకు డెమో నిర్వహించేందుకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందుకు సంబంధించిన సమాచారాన్ని యోగ మాస్టర్ ట్రైనర్స్ కు అందజేసి యోగ కార్యక్రమంలో పాల్గొనే వారి కోసం గ్రీన్ మ్యాట్స్ ఏర్పాటు చేయాలన్నారు. దేశ ప్రధాని దేశం మొత్తం మీద లక్ష ప్రదేశాల్లో యోగా చేయాలని సంకల్పించారని... అయితే మన రాష్ట్రంలోనే లక్ష ప్రదేశాల్లో యోగ కార్యక్రమాలు చేసినట్లయితే రికార్డు స్థాయిలో నిర్వహించగలిగిన వారమవుతామని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రదేశాల్లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాల ఫోటోలను తీసి అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు తప్పనిసరిగా హాజరు కావాలని, మండల స్పెషల్ ఆఫీసర్లు ఏదో ఒక గ్రామం, మండలం, నియోజకవర్గ హెడ్ క్వాటర్స్ లో తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. జిల్లాలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేలా డిఎంహెచ్ఓ, మున్సిపల్ కమీషనర్, డిఎస్డిఓ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్ కు సంబంధించి 8 లక్షల రిజిస్ట్రేషన్ లక్ష్యానికి గాను ఇప్పటివరకు 7.54 లక్షల రిజిస్ట్రేషన్ పూర్తయిందని పెండింగ్లో ఉన్న 46వేల రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం సాయంత్రం లోగా పూర్తి చేయాలని డిఎల్డిఓలు, మున్సిపల్ కమీషనర్లు కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఈ నెల 14, 21వ తేదీలలో జరిగే కార్యక్రమం గురించి స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించి ఆహ్వానించాలన్నారు. అదే విధంగా పాఠశాలలు, కళాశాలు ప్రారంభం అయిన నేపథ్యంలో విద్యార్థిని, విద్యార్థులందరినీ యోగాంధ్ర యాప్ లో నమోదు చేసి వారికి శిక్షణ ఇచ్చి 14వ తేదీన యోగా కార్యాలయంలో పాల్గొనేలా చూడాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో కూడా యోగంద్ర కార్యక్రమం నిర్వహించేలా చూడాలన్నారు. అదే విధంగా మండల, జిల్లా స్థాయిలో జరిగే అన్ని కార్యక్రమాల్లో అందరినీ ఉత్తేజ పరచి ఉత్సాహంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్



- యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్ లక్ష్యాన్ని పూర్తి చేయండి - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

# శ్రీశైల మండలంలో ఎన్డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ





మనగలం :సున్నిపెంట తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా శ్రీశైల మండలంలో గురువారం నాడు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి నాగేళ్ళ సురేష్ ఆధ్వర్యంలో సున్నిపెంటలో రింగ్ పార్కు సెంటర్ నుంచి వెస్టన్ కాలనీ ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలవేసి భారీ నినాదాలతో నివాళు లర్పించారు. అనంతరం సున్నిపెంట గ్రామంలో వెస్టన్ కాలనీ నుంచి పెట్రోల్ బంకు,కాకుల్ సెంటర్, బండ్ల బజార్,చాపల మార్కెట్, పూర్ణానంద స్వామి ఆశ్రమం,అక్కమ్మ సెంటర్, బస్టాండ్,అంబేద్కర్ సెంటర్ తదితర ప్రాంతాలలో తమ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తాసిల్దార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మీసేవ ఆపరేటర్లు

మన గళం డోన్ తహసిల్దార్ రవికుమార్ నిమీసేవ ఆపరేటర్లు ధనుంజయ ,రవి, రామేశ్వర్ గౌడు, సుధాకర్ కలిసిమర్యాదపూర్వకంగా కలసి శాలువాతో అనంతరంవారుమీసేవ లకు రేషన్ కార్డు సర్వీసులు మరియు ఆధార్ సర్వీసులు ఇవ్వాలని తహసిల్దార్ గారిని కోరడమైనది. సచివాలయాలు వచ్చినాక మీ సేవను ప్రజలు ఎవరు గుర్తించడం లేదు మాకు సచివాలయాల్లో రేషన్ కార్డు సర్వీసులు మీ సేవలకు సమానంగా ఇవ్వవలసిందిగా కోరడమైనది. తాసిల్దార్ సానుకూలంగా స్పందించారు.



# జి వి ఆర్ పాఠశాలలో సోలార్ సిస్టం ఏర్పాటు

మన గళం కోడుమూరు: కోడుమూరు పట్టణంలోని జివిఆర్ పాఠశాలలో సెం కార్ప్ గ్రీన్ ఇన్ఫ్రా విండ్ సొల్యూషన్ లిమిటెడ్ కంపెనీ వారు పాఠశాలలో 10 కిలో వాట్స్ కెపాసిటీ గల సోలార్ ప్లాంట్ ను 5 లక్షల రూపాయల వ్యయంతో సోలార్ సిస్టం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం. సేమ్ కార్ప్ సైట్ ఇంజనీర్ సి. మణికంఠన్ 10 కిలో వాట్స్ కెపాసిటీ గల సోలార్ ప్లాంట్ ను జివిఆర్ పాఠశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెడ్మాస్టర్ తైమూర్ భాష అధ్యక్షతన , ఉపాధ్యాయులు పాఠశాల కమిటీ చైర్మన్ కే ధర్మరాజు సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు తైమూరు భాష మాట్లాడుతూ ఈ ప్లాంట్ ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యుత్ పొదుపు ఆదా అవుతుందని వెల్లడించారు. ప్రారంభోత్సవ అనంతరం సేమ్ కార్ప సైట్ ఇంజనీర్ ను శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారుసత్కరించారు ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



## విమాన ప్రమాద ఘటన పై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎం.పి బస్తిపాటి నాగరాజు

మనగళం, కర్నూలు గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ లో జరిగిన ఘోర విమాన ప్రమాదం పై కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. మాఘాని నగర్ లోని వైద్య కళాశాల భవనం పై విమానం కూలిన ఘటనలో 242 మంది ప్రయాణికులు మృతి చెందడం తో పాటు, పలువురు వైద్య విద్యార్థులు మరణించడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా నని ఆయన తెలిపారు.



# పారిశుద్ధ్య కార్యక్రమం





మనగళం శ్రీశైలం : స్వచ్ఛ ఆంధ్ర సేవా కార్యక్రమములో భాగంగా ఈరోజు (12.06.2025) క్షేత్ర పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించబడింది. ప్రతీ గురువారము క్షేత్రపరిధిలో ఈ విస్తృత పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోంది. ఈ రోజు జరిగిన స్వచ్ఛాంధ్ర సేవాకార్యక్రమములో క్షేత్రంలోని పలు ప్రదేశాలలో ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనులు చేయడం జరిగింది. క్షేత్రంలోని ప్రధానాలయ రహదారి, క్యూ కాంప్లెక్స్, పలు ప్రధాన రహదారులు, ఆరుబయలు ప్రదేశాలు మొదలైనచోట్ల ఈ పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించబడింది. కాగా పారిశుద్ధ్య నిర్వహణకుగాను క్షేత్రాన్ని 6 జోన్లుగా, 11 సెక్టార్లుగా, 66 ప్రదేశాలుగా విభజించడం జరిగింది. ఈ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రతీ జోనుకు కూడా దేవస్థానం యూనిట్ అధికారులను, పర్యవేక్షకులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగింది. అదేవిధంగా ఆయా జోన్లలో పలువురు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించబడ్డాయి. దాదాపు అన్ని విభాగాల సిబ్బంది కూడా ఈ ప్రత్యేక విధులను కేటాయించడం జరిగింది. ఈ రోజు జరిగిన పారిశుద్ధ్య కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.



# పనులను వేగవంతం చేయండి

- నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు
- ఆశోక్ నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి పరిశీలన



మనగళం, కర్నూలు :నగరంలో ప్రాధాన్యమున్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఆశోక్ నగర్ రైల్వే అండ్ బ్రిడ్జి వద్ద డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు అసౌకర్యంగా కలగకుండా సాధ్యమైనంత త్వరగా నాణ్యత ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అశోక్ నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపునీరు నిలవకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, రూ.25 లక్షలతో డ్రైనేజీ కాలువ నిర్మాణానికి ఇటివలే రాష్ట్ర మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన చేశారన్నారు. వీటిని అత్యవసర పనిగా భావించి అధిక ప్రాధాన్యతనిచ్చామని, పనులను వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. వర్షం పడినప్పుడు ఎప్పటికప్పుడు వర్షపునీరుని తొలగిస్తున్నామని, నిలవకుండా శాశ్వత చర్యలు సైతం తీసుకుంటున్నామని, పనులు పూర్తి అయ్యేవరకు ప్రజలు సంయమనం పాటించి నగరపాలకకు సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, డిఈఈ గంగాధర్, ట్రైనీ ఏఈ మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

# దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు





మనగళం శ్రీశైలం : లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు (12.06.2025) ఆలయ ప్రాంగణం లోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి విశేషపూజలను నిర్వహించింది. ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహా గణపతి పూజను జరిపించబడింది. ఆ తరువాత దత్తాత్రేయ స్వామి వారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. లోకో ద్ధరణ కోసమై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు. కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది. ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు. కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది. కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమావిశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు. శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజనగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు. వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది. నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు. కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహసరస్వతీస్వామి అదృశ్య రూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసరస్వతిస్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చొని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది.

## కోడుమూరులో తెలుగుదేశం పార్టీ నాయకులు సంవత్సరాది పాలన సంబరాలు



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో స్థానికంగా తెలుగుదేశం పార్టీ నాయకులు సంవత్సరాది పాలన సంబరాలు ఎంతో వైభవంగా జరుపుకున్నారు రాష్ట్రంలో వైసిపి విధ్వంస పాలన అంతమై టిడిపి జనసేన బిజెపి సాధించిన విజయం ప్రజా విజయమని తెలుగుదేశం కోడుమూరు మండల అధ్యక్షులు గంగాధర్ నాయుడు పేర్కొన్నారు ప్రస్తుత ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా టిడిపి నాయకులు గురువారం కోడుమూరు పట్టణంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు పెద్ద సంఖ్యలో టిడిపి శ్రేణులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఎల్లప్ప నాయుడు బ్రిటిష్ రాముడు మల్లేష్ మధు ధనుంజయ బలరాం బడేషాగౌడ్ లక్ష్మన్న డీలర్ కృష్ణ టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# జీఆర్‌టీ నుంచి గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ ప్లాన్



మన గళం : ఆభరణాల రిటైలింగ్ దిగ్గజం జీఆర్‌టీ జువెలర్స్ తమ కస్టమర్ల కోసం గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ ప్లాన్‌ను ప్రారంభించింది. ఇది 11 నెలల పాటు బంగారంపై పెట్టుబడి పెట్టే ఆకర్షణీయమైన ప్లాన్. కనీస పెట్టుబడి రూ.1000. ఆ పైన ఎంత మొత్తంలో అయినా ఇన్వెస్ట్ చేయవచ్చు. వారు 11 నెలల అనంతరం తమకు ఇష్టమైన ఆభరణాలు కొనుగోలు చేయవచ్చునని జీఆర్‌టీ జువెలర్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో రెండు ఆప్షన్లుంటాయి. ఒకటి బరువు ఆధారిత ప్లాన్ కాగా రెండోది విలువ ఆధారిత ప్లాన్. ఈ రెండింటిలో ఏదో ఒకటి కస్టమర్ ఎంచుకోవచ్చు. 18 శాతం వరకు ఎలాంటి తరుగు వసూలు చేయకపోవడం ఈ ప్లాన్ ప్రత్యేకత. బంగారం, వజ్రాలు, ప్లాటినం, వెండి ఆభరణాలన్నింటికీ ఈ ప్లాన్ వర్తిస్తుంది. బంగారం ధరలు భారీ ఆటుపోట్లకు గురవుతున్న ప్రస్తుత వాతావరణంలో ఇది కస్టమర్ల సొమ్ముకు విలువ చేకూర్చే చక్కని ప్లాన్ అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ 'ఆనంద్' అనంత పద్మనాభన్ అన్నారు. నెలవారీ వాయిదా ఎంపిక నుంచి ఎప్పటికప్పుడు చెల్లింపులకు సంబంధించిన అలర్ట్‌లు జారీ చేయడం వరకు అన్నింటిలోనూ తమ నిపుణులు కస్టమర్లకు మార్గదర్శకం చేస్తారని చెప్పారు. జన్మదినాలు, ఇతరత్రా వేడుకల సమయంలో కుటుంబ సభ్యులకు ఆకర్షణీయమైన బహుమతులు ప్లాన్ చేసేందుకు ఇది చక్కని అవకాశమని మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్ అన్నారు.

# ఈ స్టాక్‌పై రూ.4 లక్షల పెట్టుబడి.. ఏడేళ్లలోనే రూ.56 లక్షల లాభం..

మన గళం : స్టాక్ మార్కెట్ ఎప్పుడు ఎలా ఉంటుందో చెప్పలేం. కానీ దీనిపై పరిశోధన చేసి అనేక మంది కూడా తక్కువ మొత్తంతో, తక్కువ టైంలోనే భారీ మొత్తాలను సంపాదిస్తున్నారు. అందుకు ఈ వార్తనే ఉదాహరణ అని చెప్పవచ్చు. ఇది అనేక మందికి కూడా అర్థం కాదని, దీని నుంచి పెద్ద ఎత్తున నష్టాలు వస్తాయని పలువురు చెబుతుంటారు. కానీ స్టాక్ మార్కెట్ గురించి సరిగ్గా తెలుసుకుని, దీర్ఘ కాలంలో మంచి స్టాక్స్ ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్ చేస్తే మాత్రం భారీ లాభాలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఆయా కంపెనీల షేర్స్ కొనుగోలు చేసి కనీసం ఐదేళ్లు లేదా పదేళ్ల వరకు చూస్తే మాత్రం, మీరు చేసిన పెట్టుబడి కంటే రెట్టింపు మొత్తాలను పొందవచ్చని అంటున్నారు. ఇక్కడ కూడా అచ్చం అలాగే జరిగింది. కానీ ఇది ఓ చిన్న కంపెనీ స్టాక్ విషయంలో జరగడం విశేషం. ఎందుకంటే చిన్న కంపెనీల స్టాక్ ఎంపిక చేసుకుని పెట్టుబడులు చేయడం అంత ఈజీ కాదని చెప్పవచ్చు. అలాంటి కంపెనీలను ఎంచుకుని భారీ లాభాలను అందించిన వాటిలో ఇప్పుడు రతి స్టీల్ కూడా చేరింది. ఎందుకంటే ఈ కంపెనీలో ఇన్వెస్ట్ చేసిన పెట్టుబడిదారులకు ఇది గత ఐదు సంవత్సరాలలో దాదాపు 650% కంటే ఎక్కువ రాబడిని అందించింది. ఈ క్రమంలో ఈ స్టాక్ అనేక మంది చిన్న పెట్టుబడిదారుల కలలను నిజం చేసింది. ఈ మధ్య కాలంలో ఈ స్టాక్ పనితీరులో భారీ హెచ్చుతగ్గులు కనిపించాయి. ఈ నేపథ్యంలో స్మాల్ క్యాప్ స్టాక్ రతి స్టీల్ షేర్లు సోమవారం 7% కంటే ఎక్కువ పెరిగి రూ.30కి చేరుకున్నాయి. ఈ కంపెనీ స్టాక్ ఏడేళ్ల క్రితం అంటే 2018లో రూ.2గా ఉంది. ఆ సమయంలో ఈ కంపెనీ స్టాక్స్ రెండు లక్షలు కొనుగోలు చేసి, ఇప్పటి వరకు ఉంచిన వారికి మంచి లాభాలు వచ్చాయని చెప్పవచ్చు. అంటే అప్పుడు 4 లక్షల రూపాయలు ఇన్వెస్ట్ చేసిన వారికి ఇప్పుడు మాత్రం రూ.56 లక్షలు వచ్చాయని చెప్పవచ్చు. అంటే కేవలం ఏడేళ్లలోనే 15 రెట్ల లాభం వచ్చింది. కనీసం ఐదేళ్లపాటు ఈ కంపెనీలో పెట్టుబడులు ఉంచిన వారికి సైతం మంచి రాబడులు వచ్చాయి. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్లో చిన్న కంపెనీల స్టాక్స్ మరోసారి సత్తా ఏంటో నిరూపించాయి.

# 15 నిమిషాల్లో సిద్ధమయ్యే టిఫిన్ రెసిపీలు



మన గళం : ఉదయం పూట ఇంట్లో అందరూ బిజీగా ఉంటారు. అలాంటి సమయంలో ఆరోగ్యకరమైన టిఫిన్ త్వరగా చేయాలంటే చాలా మంది కంగారు పడుతుంటారు. ముఖ్యంగా దక్షిణ భారత వంటలు అంటే పిండి నానబెట్టి, పులియబెట్టి, ఎక్కువ సమయం పడుతుందనే అపోహ ఉంటుంది. కానీ కొన్ని సులభమైన టిఫిన్ ఐటెమ్స్ నిజానికి 15 నిమిషాల్లోనే సిద్ధమవుతాయి. మిగిలిపోయిన అన్నం ఉంటే చాలు ఇది సులభంగా తయారవుతుంది. ఒక పాన్ లో నూనె వేయాలి. ఆవాలు, కరివేపాకు, పచ్చిమిరపకాయలు, మినపప్పు, వేరుశెనగలు వేసి వేయించాలి. కొద్దిగా పసుపు, ఉప్పు వేయాలి. చివరగా నిమ్మరసం చిందించి అన్నంలో కలిపితే సరిపోతుంది. చల్లారినా రుచిలో మార్పు ఉండదు. రవ్వ ఉప్మాతో తయారయ్యే ఈ ఉప్మా ఉదయం ఆకలిని బాగా తీరుస్తుంది. దీన్ని తయారు చేయడానికి ముందుగా రవ్వను వేయించాలి. తర్వాత ఒక పాన్ లో నూనె వేసి ఆవాలు, కరివేపాకు, అల్లం ముక్కలు, ఉల్లిపాయలు వేసి వేయించాలి. అవి వేగాక వేడి నీళ్లు పోసి రవ్వను నెమ్మదిగా జల్లుతూ ఉండలు కట్టకుండా కలుపుకోవాలి. ఇలా చేస్తే తక్కువ సమయంలోనే రుచికరమైన ఉప్మా సిద్ధమవుతుంది. ఇది త్వరగా సులభంగా చేసుకునే అల్పాహారం. పెసరపప్పుతో తయారయ్యే ఈ దోశ ఉదయపు భోజనానికి చాలా సరైనది. నానబెట్టిన పెసరపప్పుతో టొమాటో, అల్లం, మిరపకాయలు వేసి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని పెనంపై పోసి రెండు వైపులా కాల్చితే చాలు. చట్నీ లేకుండానే రుచిగా తినవచ్చు. ఇడ్లీ లేదా దోశ పిండి లేనప్పుడు రాగి పిండి మంచి ప్రత్యామ్నాయం. రాగి పిండి, బియ్యపు పిండి, పెరుగు, ఉల్లిపాయలు, కొత్తిమీర కలిపి నీటితో పల్చగా చేయాలి. పెనంపై వేసి కాల్చాలి. ఇది ఐరన్, కాల్షియంతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారం. రెడీ టు కుక్ రైస్ వర్మిసెల్లి ఉపయోగించండి.. చాలా త్వరగా ఈ వంటకం తయారవుతుంది. వేడి నీటిలో వర్మిసెల్లిని నానబెట్టి వడపోసి పాన్ లో కరివేపాకు, ఆవాలు, ఉల్లిపాయలు, క్యారెట్, క్యాప్సికం వేయించాలి. చివరగా వర్మిసెల్లి రైస్ ని ఉప్పుతో కలపాలి. తేలికగా ఉండే ఈ వంటకం టిఫిన్ బాక్స్ కోసం చాలా బాగుంటుంది. ఇడ్లీలు మిగిలిపోయినప్పుడు వాటిని చిన్న ముక్కలుగా కట్ చేసుకోండి. ఒక పాన్ లో నూనె వేసి ఆవాలు, కరివేపాకు వేయాలి. ఆ తర్వాత ఇడ్లీ ముక్కలను వేసి బాగా వేయించాలి. ఇలా తయారు చేసిన పొడి ఇడ్లీ చాలా రుచిగా ఉంటాయి. ఇది టిఫిన్ బాక్స్ లో చల్లారినా కూడా దాని రుచి మారదు. అలాగే ఉంటుంది.పెరుగు అన్నం తయారు చేయడం చాలా సులభం.. తినడానికి చాలా హాయిగా ఉంటుంది. ముందుగా అన్నంలో పెరుగు, కొద్దిగా పాలు, ఉప్పు వేసి బాగా కలపాలి. ఆ తర్వాత ఆవాలు, కరివేపాకు, అల్లంతో తాలింపు వేసి అన్నంలో కలుపుకోవాలి. చివరగా పైన ద్రాక్షలు లేదా దానిమ్మ గింజలు వేసుకుంటే పెరుగు అన్నానికి ఒక ప్రత్యేకమైన రుచి వస్తుంది.

# ఖాళీ కడుపుతో ఈ జ్యూస్ తాగితే ఎన్ని ప్రయోజనాలో..



మన గళం : బూడిద గుమ్మడికాయ ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరం అంటున్నారు ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ప్రకృతి ప్రసాదం అంటున్నారు. ఇందులో విటమిన్ సి, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు వంటి అనేక పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరాన్ని అనేక సమస్యల నుండి రక్షిస్తాయి. ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. బూడిద గుమ్మడికాయ జ్యూస్ శరీరాన్ని డిటాక్స్ చేయడమే కాక, పలు ఆరోగ్య సమస్యలకు పరిష్కారం కూడా. ఇందులో అత్యంత తక్కువ కేలరీలు ఉండడం, అధిక నీరు, విటమిన్లు, ఖనిజాలు ఉండడం దీన్ని ఆరోగ్యానికి అమృత సమానంగా మారుస్తుంది.బూడిద గుమ్మడికాయ జ్యూస్‌లో క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, జింక్ ఇందులో సమృద్ధిగా ఉంటాయి. విటమిన్ సి, బి కాంప్లెక్స్ కూడా ఉంటాయి. బూడిద గుమ్మడికాయ రసం శరీరాన్ని డిటాక్స్ చేస్తుంది. అన్నిటికన్నా ముఖ్యంగా బూడిద గుమ్మడికాయ రసం బరువు తగ్గించడంలో చాలా సహాయపడుతుంది. కడుపులో మంట, అజీర్ణం లాంటి సమస్యలు ఉంటే ఈ జ్యూస్ తాగడం వల్ల తగ్గిపోతాయి. ఈ జ్యూస్ రోజు తీసుకోవడం వల్ల.. గ్యాస్, అల్సర్ సమస్యలు తగ్గుతాయి. రోగనిరోధక శక్తిని పెంచడానికి బూడద గుమ్మడికాయ జ్యూస్ సహాయం చేస్తుంది. బూడిద గుమ్మడికాయ జ్యూస్‌ను తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్స్ నుంచి దూరంగా ఉండొచ్చు. షుగర్‌ను కంట్రోల్ చేయడానికి ఈ జ్యూస్ బాగా హెల్ప్ చేస్తుంది. షుగర్ ఉన్న వాళ్లు రెగ్యులర్‌గా తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ప్రతి రోజు ఈ జ్యూస్ తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ సమస్య రాదు. రెగ్యులర్‌గా తీసుకుంటే అనేక ప్రయోజనాలు పొందవచ్చు. నిద్రలేమితో బాధపడే వాళ్లకి బూడిద గుమ్మడికాయ జ్యూస్ మంచి ఎంపిక. ఈ జ్యూస్‌ను రెగ్యులర్‌గా తీసుకుంటే నిద్రలేమి నుంచి బయటపడొచ్చు.గుమ్మడికాయ రసాన్ని తెలుసుకోవడం వలన వాత, పిత్త దోషాలు బ్యాలెన్స్ అవుతాయి. హెల్తీగా ఉండొచ్చు. బూడిద గుమ్మడికాయ జ్యూస్ తాగితే కిడ్నీ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ జ్యూస్ తాగితే కిడ్నీ సమస్యలు దూరం అవుతాయి. కిడ్నీలో రాళ్లు తగ్గుతాయి. మూత్ర సంబంధిత సమస్యలకు దూరంగా ఉండడానికి ఈ జ్యూస్ బాగా ఉపయోగపడుతుంది. ఈ జ్యూస్ తాగితే యూటిఐ తగ్గుతుంది. ఈ జ్యూస్ ని తీసుకుంటే మంచి ఎనర్జీని ఇస్తుంది. రెగ్యులర్‌గా దీన్ని తీసుకోవడం వలన ఒంట్లో ఉన్న మలినాలు బయటకు వెళ్లిపోతాయి. సైనస్ సమస్యలు ఉంటే కూడా దీనిని తీసుకోవడం మంచిది.

# ఆరోగ్య నిధి..పచ్చి బాదంపప్పు



మన గళం : బాదంపప్పును రోజుకు 7, 8 తీసుకుని రాత్రి పూట నీటిలో నానబెట్టి మరుసటి రోజు ఉదయం బ్రేక్ ఫాస్ట్‌లో భాగంగా తినాలని పోషకాహార నిపుణులు చెబుతుంటారు. కానీ, పచ్చిబాదం కాయలు కూడా బోలెడన్నీ ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. పచ్చి బాదం పప్పు జెల్‌లాగా సుతిమెత్తగా ఉంటుంది. రుచిలో కాస్త తియ్యగా, పులుపుగా, వగరుగా ఉంటుంది. అయితే, ఇందులోని ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం అనేకం అంటున్నారు నిపుణులు. పచ్చిబాదంలోనూ అనేక పోషకాలు ఉంటాయి. ఎండిన బాదం కంటే కూడా పచ్చి బాదంలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. పచ్చి బాదంపప్పులో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల త్వరగా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయ పడుతుంది. బరువును నియంత్రణలో ఉంచుతుంది. పచ్చి బాదంలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ బి, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలించి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. పచ్చి బాదంలో ఉండే విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. దీంతో శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. రోగాలు రాకుండా రక్షిస్తుంది. పచ్చిబాదంలో అన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. పచ్చి బాదం తినటం వల్ల శరీరంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి పచ్చిబాదం ఎంతో మేలు చేస్తుంది. దీంతోపాటు గుండె పోటు రాకుండా రక్షిస్తుంది. పచ్చి బాదంలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఇ అధికంగా ఉండి చర్మం, జుట్టు సంరక్షణకు మేలు చేస్తుంది

# ఎక్కువగా వాకింగ్ చేయడం మంచిదేనా..?



మన గళం : నడక ఆరోగ్యాన్ని పెంచడంలో సహాయపడే చాలా సులభమైన వ్యాయామం. శరీరాన్ని చురుకుగా ఉంచడంలో, మనసును ప్రశాంతంగా ఉంచడంలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది. అయితే ఏదైనా హద్దుకు మించి చేస్తే దాని ప్రభావం చెడుగా మారే అవకాశం ఉంది. అదే విధంగా అతి ఎక్కువగా నడవడం వల్ల కూడా శారీరక సమస్యలు రావచ్చు. సాధారణంగా చాలా మంది ఆరోగ్యంగా ఉండటానికి రోజుకు 10,000 అడుగులు నడవాలని అనుకుంటారు. కానీ ఇది అందరికీ ఒకేలా వర్తించదు. మీ వయస్సు, ఆరోగ్యం, జీవనశైలి ఆధారంగా ఇది మారవచ్చు. సాధారణంగా 8,000 నుంచి 10,000 అడుగుల వరకు నడవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు వస్తాయి. దీని వల్ల షుగర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయి, గుండె సంబంధిత సమస్యలు అదుపులో ఉంటాయి. మీ శరీరం శక్తి మేరకు నడక పరిమితి ఉండాలి. కొత్తగా నడక ప్రారంభించిన వారు 30 నిమిషాలు నడిస్తే ఇబ్బంది, కీళ్ల నొప్పులు అనుభవించవచ్చు. కానీ అనుభవం ఉన్నవారు గంటల తరబడి నడిచినా ఇబ్బంది లేకుండా ఉండవచ్చు. అయితే శరీరం చెప్పే సంకేతాలను పట్టించుకోకుండా నడిస్తే నెమ్మదిగా సమస్యలు మొదలవుతాయి. గతంలో గాయపడిన కీళ్ల ప్రాంతాల్లో మళ్లీ నొప్పి మొదలవుతుంది. ఎక్కువగా నడవడం వల్ల కీళ్లపై ఒత్తిడి పెరిగి సమస్యలు వస్తాయి. చెప్పులు సరిగా లేకపోవడం లేదా ఎక్కువగా నడవడం వల్ల కాళ్లపై గడ్డలు, బొబ్బలు ఏర్పడతాయి. ఇవి నడిచేటప్పుడు ఇబ్బందిగా మారతాయి. శరీరం అలసిపోయినట్లు అనిపించడం, చిన్న పని చేసినా శ్వాస తీసుకోవడం కష్టంగా అనిపించడం వంటి లక్షణాలు ఎక్కువగా నడుస్తున్నారని సూచిస్తాయి. మొత్తం రోజంతా నడిచిన తర్వాత కాళ్లలో వాపు, నొప్పి రావడం సహజం. ఇది క్రమంగా పెద్ద సమస్యగా మారవచ్చు.నడక మనసుకు శాంతిని ఇవ్వగలిగే శక్తి ఉన్నా.. హద్దు మించి చేస్తే ఆందోళన, నిరాశ, కోపం వంటి భావోద్వేగాలు పెరిగే అవకాశం ఉంటుంది.తాజాగా నడక మొదలుపెట్టే వారు రోజుకు 15 నిమిషాల పాటు నడవడం ప్రారంభించాలి. ఆ తర్వాత ప్రతి వారం కొద్దిగా సమయం పెంచుకుంటూ 30 నిమిషాల వేగవంతమైన నడక సాధన దిశగా కదలాలి.నడక సమయంలో నోటితో కాకుండా ముక్కుతో శ్వాస తీసుకోవడం మంచిది. పూర్తి ప్రయోజనాల కోసం వారంలో కనీసం 3 రోజులపాటు నడక చేయడం మంచిది. నడక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన సాధనమే అయినా.. దానికి కూడా పరిమితి అవసరం. శరీరానికి విశ్రాంతి ఇవ్వకుండా ఎక్కువగా నడవడం వల్ల దీర్ఘకాలిక నష్టాలు కలుగుతాయి. కాబట్టి నడకను ఒక ఆరోగ్య అలవాటుగా చేసుకోండి కానీ మించిపోకుండా జాగ్రత్త వహించండి.

# చేప గుడ్లు తింటున్నారా..?



మన గళం : నాన్ వెజ్ ప్రియులు చికెన్, మటన్‌తో పాటు చేపలు కూడా ఎక్కువగా తింటూ ఉంటారు. అలాగే, చేపలతో పాటు వాటి గుడ్లను చాలా మంది ఇష్టంగా తింటుంటారు. కానీ, చేప గుడ్లను తరచూ తినటం వల్ల శరీరంలో కలిగే మార్పులు, ఆరోగ్య ప్రయోజనాలేంటో ఎప్పుడైనా ఆలోచించారా..? ఈ చేప గుడ్లలో ప్రధానంగా మెగ్నీషియం, ఫాస్ఫరస్, విటమిన్ డి, కాల్షియం ఉంటాయి. చేప గుడ్లు తినే అలవాటు కూడా చాలామందిలో ఉంటుంది. ఈ గుడ్లలో పోషకాలు ఉంటాయి. పొటాషియం కలిగి ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గిస్తుంది. అయితే లోబీపీతో బాధపడేవారు తీసుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. అలాగే, గుండె ఆరోగ్యానికి కూడా చేప గుడ్లు ఎంతో ప్రయోజనకరం అంటున్నారు నిపుణులు. తరచూ చేప గుడ్లు తినటం వల్ల గుండె ప్రమాదాలు దరి చేరకుండా తప్పిస్తాయి. ఇందులో ఉండే ఒమేగా 3 ఫ్యాటీ ఆసిడ్స్ మెదడు పనితీరును మెరుగు చేస్తుంది. అంతేకాదు చేప గుడ్ల వల్ల కంటి ఆరోగ్యం కూడా బాగుంటుంది. ఇవి కొన్ని రకాల క్యాన్సర్లకు వ్యతిరేకంగా పోరాడుతాయి. చేప గుడ్లలోశరీరానికి అవసరమైన న్యూట్రిషన్లు, బి 12, డి, ఎ తదితర విటమిన్లు, మినరల్స్, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. మతిమరపు సమస్య ఉన్నవారు, అల్జీమర్స్ పేషెంట్లు కూడా క్రమం తప్పకుండా చేప గుడ్లను తినటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. చేప గుడ్లలో లభించే విటమిన్ ఏ కంటి చూపు మెరుగుపరచడంలో సాయపడుతుంది. చేపలు, వాటి గుడ్లు తినటం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరిగి రక్తం శుద్ధి చేస్తుంది. రక్తహీనతతో బాధపడే వారికి చేపగుడ్లు బెస్ట్ ఆప్షన్ అంటున్నారు నిపుణులు. రెగ్యులర్‌గా చేప గుడ్లు తింటే బీపీ సమస్య తగ్గుతుంది. చేప గుడ్లలో ఉండే విటమిన్ డి తో ఎముకలు, దంతాలను దృఢంగా మారతాయి. చేప గుడ్లు చర్మ ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. వీటితో చర్మానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. వృద్ధాప్యాన్ని దూరం చేస్తుంది. శరీరానికి అవసరమైన పాళ్లలో అయోడిన్ ఉంటుంది. హార్మోన్ బ్యాలెన్స్‌కి, జీర్ణక్రియకు ఇది ఉపయోగపడుతుంది. కండరాల ఎదుగుదలకు చేపగుడ్లు ఉపయోగపడతాయి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

# ఇంట్లో ఈ ప్రదేశంలో డబ్బులు పెడుతున్నారా..



మన గళం : వాస్తు శాస్త్రంలో ఇంట్లో సుఖ శాంతులు, సిరి సంపదలు నిలవాలంటే ఇంట్లోని వస్తువులు ఎక్కడ ఉంచాలి? ఎక్కడ ఉంచడం మంచిది కాదో కూడా వివరించింది. మనం ఇంట్లోకి రాగానే డబ్బులను తోచిన చోట పెట్టేస్తాం. అంతేకాదు ఇంట్లో డబ్బులు పెట్టుకునే సేఫ్ లాకర్ ని కూడా సరైన స్థానంలో పెట్టుకోవాలి. లేదంటే లక్ష్మీ దేవి ఆగ్రహం కలుగుతుంది. ఆ ఇంటి నుంచి దూరంగా వెళ్ళిపోతుంది. అప్పుడు డబ్బులకు ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. మన జీవితంలో వాస్తు శాస్త్రం ప్రాముఖ్యత ఎంతో ఉంది. ఎవరైనా సరే వాస్తు శాస్త్రంలో పేర్కొన్న నియమాలను సరిగ్గా పాటిస్తే ఫలితాలు చాలా శుభప్రదంగా, సంపన్నంగా ఉంటాయి. అదే సమయంలో ఈ నియమాలను విస్మరించినప్పుడు దాని ఫలితాలు కూడా ప్రతికూలంగా ఉంటాయి. వాస్తు శాస్త్రంలో డబ్బు లేదా సంపద గురించి అనేక రకాల నియమాలు చెప్పబడ్డాయి. ఈ రోజు మీరు పొరపాటున కూడా డబ్బును ఇంట్లో ఉంచకూడని కొన్ని ప్రదేశాల గురించి తెలుసుకుందాం. మీరు ఈ ప్రదేశాలలో డబ్బును ఉంచితే లక్ష్మీదేవి మీ నుంచి శాశ్వతంగా దూరమవుతుంది. జీవితం పేదరికంలో గడిచిపోతుంది. దక్షిణ దిశలో డబ్బు ఉంచవద్దు. వాస్తు శాస్త్రం ప్రకారం మీరు పొరపాటున కూడా ఇంటికి దక్షిణ దిశలో డబ్బు ఉంచకూడదు. ఈ దిశను ఎల్లప్పుడూ యమరాజు దిశగా పరిగణిస్తారు. ఈ దిశలో డబ్బు ఉంచడం ప్రారంభించినప్పుడు అప్పుల ఊబిలో కూరుకుపోతారు. జీవితం పేదరికంలో గడిచిపోతుంది. సురక్షితంగా ఉంచేటప్పుడు దీన్ని గుర్తుంచుకోండి వాస్తు శాస్త్రం ప్రకారం మీరు చీకటిగా ఉన్న ప్రదేశంలో ఎప్పుడూ సేఫ్‌ను ఉంచకూడదు. మీరు సేఫ్‌ను ఉంచే స్థలం శుభ్రంగా ఉండేలా, అక్కడ తగినంత వెలుతురు ఉండేలా జాగ్రత్త వహించాలి. మీరు సేఫ్‌ను చీకటిలో ఉంచితే మీ జీవితంలో ప్రతికూలత పెరుగుతుంది. టాయిలెట్ కి సమీపంలో ఉంచొద్దు వాస్తు శాస్త్రం ప్రకారం మీరు బాత్రూమ్ దగ్గర ఎప్పుడూ సేఫ్ ఉంచకూడదు. ఈ ప్రదేశం అపరిశుభ్రంగా ఉంటుంది. ప్రతికూల శక్తి కూడా ఇక్కడ నివసిస్తుంది. మీరు ఈ స్థలంలో డబ్బు ఉంచవద్దు.

